57394
57395
Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఫిబ్రవరి 07, 2010

వింతలలోకంలో తెలుగిన్నిస్

హ్యాపీ బర్త్‌డే

(2010 ఫిబ్రవరి 7 నుంచి
2010 ఫిబ్రవరి 13 వరకు)

జి.సాయి
1సం॥,ఫిబ్రవరి-7
లావణ్య-నటరాజ్
చైతన్యపురి-హైదరాబాద్

పి. శ్రీహాసిక
4సం॥, పిబ్రవరి-8
మాలతి-భాస్కర్
విశాఖపట్నం

పి.జయశ్రీ
3సం॥,ఫిబ్రవరి-2007
నిర్మల-సురేష్‌రాజు
రాజమండ్రి

బి.అరుణ
ఫిబ్రవరి-8
రాజేశ్వరి-దస్తగిరిరెడ్డి
నాగరాజుపేట-కడప

షేక్ సన
1సం॥,ఫిబ్రవరి-10
భీపాష-సాహెబ్
ఏన్కూరు-ఖమ్మం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

ENTERED
కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట



వంగతోట కాడా ఒళ్లు జాగ్రత్త!

మన కూరగాయల్లో వంకాయకు ఉన్న ప్రాశస్త్యం ఇంక దేనికీ లేదు. వంకాయ వంటి కూర, పంకజముఖి వంటి భార్య... అన్న ఊరింపును బట్టే వంకాయ స్టేటస్సు ఏమిటో అర్థం చేసుకోవచ్చు. వంకాయపై అనేక పద్యాలున్నాయి. పాటలున్నాయి. చాంతాడంత దండకాలున్నాయి. వంకాయ కూర తింటే దురద అన్న దురభిప్రాయం తప్ప- దానికింకే వంకలూ పెట్టే అవకాశం లేదు. లేత వంకాయను నాజూగ్గా కోసి, నూరిన మసాలా దిట్టంగా కూరి, సన్నని సెగమీద ఉడికిస్తుంటే ఆ ఘుమఘుమలకు నోరూరటం ఖాయం. దాని రుచి సంగతి సినీకవులకు భేషుగ్గా తెలుసు కాబట్టి- బోలెడన్ని పాటలు రాశారు. *గుత్తొంకాయ్ కూరో మావా* అని మురిపించినా, *ఆహా ఏమి రుచి... తినరా మైమరచి* అని పరవశించినా- అది వంకాయకు ఒక్కదానికే దక్కిన గౌరవం. వంగపువ్వు రంగు చీరంటే గ్రామీణ పడుచులకు ప్రత్యేకమైన అభిమానం. ఇలా ఎంతో ఉంది వంగ అంగరంగ వైభవం!

చిన్నప్పుడు కథల్లో అంగ, వంగ, కళింగ రాజ్యాలు అని చెబుతుంటే- వంకాయలక్కూడా ఒక రాజ్యం ఉంది కాబోలు అనిపించేది. దానికో రాజ్యం మాటకేం కానీ, ప్రపంచంలో వంకాయ లేని రాజ్యమంటూ లేదు. దానిది రవి అస్తమించని సామ్రాజ్యం కాబట్టే- బహుళ జాతి పెద్దల కన్ను వంగపై పడింది. దానిని గుప్పిట్లో పెట్టుకుంటే కాసులు కురుస్తాయనేది వాళ్ల ఎత్తుగడ. ఆ పెద్దల చేతిలోకి వెళితే... తరతరాలు వర్ధిల్లిన మన వంగ- పునరుత్పత్తి లేని ఉత్తి వంకాయగా మారిపోతుంది. ఇక విత్తనంపై వాళ్లదే పెత్తనం. సాంప్రదాయక వంగ తన తోట జోలికెళితే తప్ప ఏమీ చేయదు. ఈ పెద్దలు తెచ్చే బీటీ వంగ అలా కాదు; అది వట్టి కయ్యాల మారి. పక్క చేలమీదికి ఉత్తుత్తినే దాడి చేసి, వాటి పునరుత్పత్తి శక్తినీ నిరుత్తం చేస్తుందట! తన నయం కాని జబ్బులను అందరికీ వెదజల్లి- మందుల బేహారులకు స్వాహా అవకాశం కల్పిస్తుందట! ఇన్నాళ్లూ వియ్యాలకు, నెయ్యాలకు మన వంకాయ చక్కని సహాయకారి. దాని స్థానే ఈ కయ్యాల మారి కాలు పెడితే ఇంకేమైనా ఉందా?!

ఎక్కడైనా వ్యాపారం కానీ, వంగతోట దగ్గర కాదు కదా!

అదిగో, బీటీ పెద్దల కోసమే కాబోలు, సినిమా పాట వినిపిస్తోంది. :

'వంగ తోట కాడా ఒళ్లు జాగ్రత్త!'

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
కథ	...	8
తెలుసుకుందామా	...	10
నవ్వుల్ పువ్వుల్	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
పెద్దల సమక్షంలో బ్యాగు మాయం	...	17
సీరియల్	...	18
విజ్ఞాన వీచిక	...	20
క్రైమ్‌కథ	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఆ పుస్తకాలే నా నేస్తాలు

సినిమా కబుర్లు ... 7

తెలుగు తెర ఆనంద బ్రహ్మ

చూద్దామా ... 22

పంచభూత లింగ క్షేత్రాలు



అలరించాయి

జనవరి 24 ఆదివారం స్నేహ సంచికలో వెయ్యేళ్ల కోవెల విశేషాలు బాగా అలరించాయి. తంజావూరులో లక్ష్మీ విశ్వవిద్యాలయం వెయ్యి సంవత్సరాల నుండి వెలుగొందడం గర్వించదగ్గ విషయం. ఇదే విధంగా బృహదీశ్వర ఆలయం. ఈ పేరు వింటాం కానీ ఆ పురాతన ఆలయ వైభవ విశేషాలు దర్శించిన వారికి మాత్రమే తెలుస్తాయి. ఆ దేవాలయంపై గల కళాత్మక శిల్పాలు నాటి శిల్ప కళాకారుల నైపుణ్యానికి నిదర్శనం.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

చక్కని విషయాలు

జనవరి 24 సంచికలో సినిమా కబుర్లు శీర్షికలో ఛాయాగ్రహకుడు వి.కె.మూర్తి గురించి చక్కని విషయాలు తెలుసుకున్నాం. స్వాతంత్ర్య సమర యోధుడు వి.కె.మూర్తి సినిమా రంగంలో ఛాయాగ్రాహకుడుగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక కావడం అభినందించదగ్గ విషయం. సాంకేతిక పరిజ్ఞానం అంతగా అభివృద్ధి కాని ఆ రోజుల్లో, ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకుని సినిమారంగంలో అద్భుతమైన కళాఖండాలకు ప్రాణ ప్రతిష్ట చేశాడనటంలో అతిశయోక్తిలేదు. ఆయనకు అభినందనలు తెలుపుతున్నాం.

ఎన్.భీమార్జున రెడ్డి, నల్లగొండ.

అనేక విషయాలు చెప్పిన గుట్కా

అట్టమీది కథగా వచ్చిన 'గుట్కా తింటే గుటుక్కే' రచన అనేక విషయాలను తెలియజేసింది. మానడానికి అందించిన చిట్కాలు అందరికీ ఎంతో అనుసరణీయమైనవిగా వున్నాయి. 'విజ్ఞాన వీచిక' ద్వారా ఈ సంవత్సరం ఎండలు మండే అగ్నిగోళంలా ఉండబోతున్నాయిని తెలుస్తోంది. 'చూద్దామా'లో వెయ్యేళ్ల కోవెల విశేషాలు బావున్నాయి. కొత్త కొత్త కార్ల మోడల్స్ 'షికారు చేసేద్దాం...'లో చూసి థ్రిల్లయ్యాం. గమ్మత్తైన విచిత్ర విశేషాలతో 'తెల్సా' శీర్షిక చాలా చక్కగా ఆకట్టుకుంటోంది. 'సినిమా కబుర్లు' ద్వారా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత వి.కె.మూర్తి గారి గురించి అనేక విషయాలను తెలుసుకోగలిగాం. ఎంతో ప్రతిష్టాత్మకమైన మాక్సిమ్ గోర్కీ 'అమ్మ' నవలను 'స్ఫూర్తి' ద్వారా మరోసారి మా స్ఫురణలోకి తీసుకొచ్చారు. 'చిన్నకథ' ఇంతకు నేనెవరిని? (మరోచీమకథ)... ముచ్చటగా వుంది. 'మనలోమాట' ప్రజలకు అన్ని రకాలుగా జరిగే నష్టాన్ని కష్టాల్ని సమూలంగా రూపుమాపేందుకు ఏ ప్రభుత్వమూ సరితూగడం లేదు. జీవితాంతం పట్టే గ్రహణం వీడేదెలా? వదిలించుకునేదెలా?

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

నోట్స్ రూపంలో రాయించాం

జనవరి 24 ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ 'గుట్కా తింటే గుటుక్కే' చదివిన తర్వాత పల్లె నుండి పట్నం వరకు ప్రతీ బడ్డీ కొట్టులో, కిళ్లీ షాపులో వేలాడదీసి ఉండే వివిధ రకాల గుట్కాలను విద్యార్థులు, యువత వాడడం మూలంగా రకరకాల నోటి సంబంధ వ్యాధులతో పాటు క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సైతం సంక్రమించి చిన్నతనంలోనే మృత్యుమార్గంలోకి వెళ్తున్నారు. గుట్కా ఎందుకు వాడతారో తెలుసుకున్నాం. ప్రభుత్వం గుట్కా తయారీపై నిషేధం విధించినా వాటి తయారీ విచ్చలవిడిగా జరుగుతోంది. మన దేశంలో 10 నుండి -12 సంవత్సరాల లోపువారు దీనిని వాడి నోటిక్యాన్సర్ బారిన పడడం విచారకరం. మానడానికి చిట్కాలు తెలుసుకుని నోట్స్ రూపంలో మా విద్యార్థులతో రాయించి, వారి తల్లిదండ్రులకు కూడా తెలపాలని చెప్పాం. ప్రభుత్వం దీన్ని పూర్తిగా కట్టడి చేయాలి.

కామిడి సతీష్‌రెడ్డి, పాకాల
శ్రీనివాసరెడ్డి, పరకాల, వరంగల్.

చక్కగా వివరించిన వాసిరెడ్డి

ఆచార్య రంగా రాజకీయంలో సమతుల్యం చూపలేకపోయారు. అయినా ఆయన చెప్పారని వాసిరెడ్డి సత్యనారాయణగారు మార్క్సిజం, లెనినిజం పుస్తకాలు చదవడం ఆరంభించారు. అందువల్ల తనను తాను మార్చుకున్నారు. చదువుకునే యువత ప్రాథమిక రాజకీయాలు నేర్చుకోవడం అప్పుడూ ఇప్పుడూ విద్యార్థి సంఘాలనుండే. వినోభాభావే పర్యటనవల్ల సాధారణ ప్రజలకు వచ్చేదేమీ లేదన్నదే వాసిరెడ్డి సత్యనారాయణ గారిని మరింత మార్క్సిజం వైపుకు తీసుకెళ్లింది. వారు ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ గారి "మహాత్ముడు ఆయన సిద్ధాంతాలు" పుస్తక స్ఫూర్తిని ఒక జర్నలిస్టుగా చక్కగా వివరించారు. అందువల్ల గాంధీజీ సిద్ధాంతాలను బూర్జువా భూస్వామి వర్గం తమకు అనుకూలంగా తిప్పుకోవడం తెలుసుకున్నాం. ఏసుక్రీస్తు సిద్ధాంతాలను నాటి పాలకులు ఎలా తమకు అనుకూలంగా తీర్చిదిద్దుకున్నారో అలాగే జరిగింది. బూర్జువా భూస్వామి వర్గం దోపిడీ వర్గం అయినందువల్ల ఈ మహాత్ముల సిద్ధాంతాలను దోచుకున్నారు. మొదటి యు.పి.ఎ ప్రభుత్వం కూడా వామపక్షాల చర్చలను తమవిగా చెప్పుకుని ముందస్తు ఎన్నికలు తెచ్చి పబ్బం గడుపుకున్నారు. డాక్టర్ బి.వి.ఎస్.స్వామిగారు రాసిన 'పాకుడు బండలు' కథ నలభై సంవత్సరాల కిందటి కథలా వుంది. ఇప్పుడు అపార్ట్‌మెంట్ గదులున్నాయి. లాడ్జింగులున్నాయి. మనుషుల్లో వచ్చిన మార్పుల వల్ల స్థలాల్లోనూ మార్పులు వచ్చాయి. ఆరోగ్యానికి, అబార్షన్లకి ఆస్పత్రులున్నాయి. అయితే బీదరికం నిలిచి వున్నందువల్ల, సమాజ న్యాయం మారనందువల్ల ఆ వ్యాపారం నిలిచివుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారి పేట, విజయవాడ.





కొబ్బరన్నం

కావలసిన పదార్థాలు

కొబ్బరి కోరు - 1కాయది, బియ్యం - పావుకిలో
నెయ్యి - 1 టేబుల్ స్పూన్, ఉల్లిపాయలు - 4, యాలకులు - 5
వెల్లుల్లి - 2 రెబ్బలు, లవంగాలు - 5, పసుపు - కొంచెం
దాల్చిన చెక్క - కొంచెం, ఎండుమిర్చి - 5, పచ్చిమిర్చి - 10
శనగపప్పు - 1 టేబుల్ స్పూన్, కరివేపాకు - 2 రెమ్మలు, ఉప్పు - తగినంత

తయారుచేసే పద్ధతి

బియ్యం కడిగి స్టౌ మీద పెట్టాలి. అన్నం పొంగు వచ్చిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, యాలకుల పొడి, లవంగాలు, దాల్చినచెక్క పొడి, పసుపు వేసి బాగా కలపాలి. కొద్ది సేపటి తర్వాత కొబ్బరికోరు వేయాలి. చిన్న మూకుడులో నెయ్యి వేసి కాగిన తర్వాత శనగపప్పు (పచ్చిపప్పు) వేయించి అందులో చితక్కొట్టిన వెల్లుల్లి, ఎండుమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి తాలింపు పెట్టి అన్నంలో వేసి కలపాలి. ఈ కోకోనట్ రైస్ మెత్తగా కాకుండా కొంచెం పొడిగా వుంటేనే బాగుంటుంది. తినేటప్పుడు ఇష్టమైతే మరికొంత నెయ్యి వేసుకుని తింటే చాలా రుచిగా వుంటుంది.

మెంతి పరోటా

కావలసిన పదార్థాలు

మెంతికూర - అరకిలో, గోధుమపిండి - పావుకిలో
నెయ్యి - 1కప్పు, ఉప్పు - రుచికి తగినంత
కారం - 1స్పూన్

తయారుచేసే పద్ధతి

మెంతికూరను శుభ్రం చేసుకుని సన్నగా తరిగి అందులో కొద్దిగా ఉప్పు, కారం కలపాలి. గోధుమపిండిలో ఉప్పు వేసుకొని చపాతి పిండిలా కలిపి కొద్దిసేపు నానబెట్టాలి. తర్వాత చిన్న వుండలు చేసుకుని చపాతీలా వత్తుకోవాలి. ఇప్పుడు దానిమీద మెంతికూర పరిచి మరో చపాతీని పెట్టి మళ్లీ కొద్దిగా వత్తుకోవాలి. ఇలా చేయడం వల్ల రెండు చపాతీలు విడిపోకుండా వుంటాయి. దీన్ని పెనంపై వేసి నెయ్యి రాస్తూ రెండు వైపులా దోరగా వేయించుకుంటే చాలా రుచిగా ఉంటాయి.



కాంజీవరం ఇడ్లీ

కావలసిన పదార్థాలు

బియ్యం - ముప్పావు కిలో, మినపప్పు - పావుకిలో
మజ్జిగ (పుల్లనిది) - 1కప్పు, పచ్చిమిర్చి - 10, అల్లం - కొంచెం,
మిరియాలు - 1 స్పూను, నూనె - అరకప్పు, నెయ్యి - అరకప్పు
కరివేపాకు - 2 రెమ్మలు, తినే సోడా - కొంచెం
ఉప్పు - తగినంత, ఇంగువ - కొద్దిగా

తయారుచేసే పద్ధతి

బియ్యం కడిగి ఎండబెట్టి నూక (ఇడ్లీ రవ్వలా) ఇసురుకోవాలి. మినపప్పు నానబెట్టి మెత్తగా రుబ్బుకోవాలి. అందులో ఉప్పు, ముందుగా తయారుచేసుకున్న బియ్యం నూక వేసి కలిపి ఒక పూట నానబెట్టాలి (పిండి పులవాలి). పులిసిన పిండిలో మజ్జిగ, నెయ్యి, నూనె, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, అల్లం ముక్కలు, ఇంగువ, అవసరమైతే కొద్దిగా ఉప్పు కలుపుకోవాలి. తర్వాత ఈ పిండిని ఇడ్లీ ప్లేట్లలో వేసి ఆవిరిమీద మామూలు ఇడ్లీలకంటే కొద్దిగా ఎక్కువ సేపు ఉడకబెట్టాలి. ఇవి వేడిగానైనా, చల్లగానైనా బావుంటాయి.

వాంగీ బాత్

కావలసిన పదార్థాలు

బియ్యం - 2 కప్పులు, వంకాయలు - 2, ఉల్లిపాయ - 1,
పచ్చిమిర్చి - 3, ఎండుమిర్చి - 3, చింతపండు - కొంచెం,
వెల్లుల్లి - 2 రెబ్బలు, ఆవాలు - 1టీస్పూన్, మినపప్పు - 1టీస్పూన్,
అల్లం - కొంచెం, కారం - కొంచెం, ఉప్పు - తగినంత, నూనె - 1టేబుల్ స్పూన్, కరివేపాకు - 2 రెమ్మలు, పసుపు - చిటికెడు, జీలకర్ర - 1టీస్పూన్

తయారుచేసే పద్ధతి

బియ్యం కడిగి స్టౌమీద పెట్టాలి. అన్నం పొంగొచ్చిన తర్వాత అందులో చిన్నగా తరిగిన వంకాయ ముక్కల్ని వేయాలి. అన్నం ఉడికిన తర్వాత కొద్దిగా చింతపండు పులుసు తీసి అందులో ఉప్పు, కారం, పసుపు కలపాలి. ఈ రసాన్ని అన్నంలో పోసి బాగా కలపాలి. చిన్న మూకుడులో నూనె పోసి బాగా కాగనిచ్చి మినపప్పు, ఎండుమిర్చి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, చితక్కొట్టిన వెల్లుల్లి, ఆవాలు, జీలకర్ర, అల్లంముక్కలు, కరివేపాకు వేసి వేయించాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు అన్నంలో వేసి కలపాలి. ఇష్టమైనవారు చింతపండుకు బదులుగా నిమ్మకాయ కూడా పిండుకోవచ్చు. అయితే ఈ అన్నం పొడిపొడిగా వుంటేనే బాగుంటుంది.



నండూరి రామమోహనరావు,
ప్రసిద్ధ రచయిత, సంపాదకులు.

ఆ పుస్తకాలే నా నేస్తాలు

నేను ఆయన ఉపదేశాన్ని వేదవాక్యంగా పాటించేవాణ్ణి. ఒక వేసవి సెలవుల్లో షేక్స్పియర్ కంప్లీట్ వర్క్స్, మరొకసారి సెలవుల్లో గోల్డెన్ ట్రెజరీ కవితా సంకలనం చదివేశాను. ఠాగూర్ నవల "ది రెక్" మాకు నాన్‌డిటైల్డ్. దాంతోపాటు గోరా నవల, ఠాగూర్ కథలు, గీతాంజలి, గార్డినర్, గ్రేట్ గేదరింగ్ లాంటి కవితా సంపుటాలు చదివేశాను. ఆ రోజుల్లో రాజమండ్రి కాలేజీ లైబ్రరీ, గౌతమీ గ్రంథాలయం ఈ రెండూ నాకు రెండు దేవాలయాల్లా వుండేవి. అప్పట్లో మా కాలేజీ లైబ్రరీ నుంచి తీసుకుని నా ఎకనామిక్స్ గ్రూపుతో ఏ సంబంధంలేని సర్‌జేమ్స్ జీన్స్ ఖగోళశాస్త్ర గ్రంథాలు "ది యూనివర్స్ ఎరౌండ్ అజ్", "ది మిస్టీరియస్ యూనివర్స్" ఎంతో ఆసక్తితో చదివాను. అప్పట్లో పాపులర్ సైన్సు పట్ల కలిగిన ఆసక్తే తర్వాత కాలంలో "విశ్వరూపం", "నరావతారం" గ్రంథాలు రాయడానికి నాకు ప్రేరణ ఇచ్చింది.

నాకు జ్ఞాపకమున్నంత వరకు నేను చదివిన మొట్టమొదటి పాఠ్యేతర పుస్తకం 'శ్రీమహా భక్త విజయం'. ఆ పేరుతో నలుగురు గ్రంథకర్తలు నాలుగు గ్రంథాలు రాశారు. నేను చదివింది శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిదో, మేడేపల్లి వారిదో, మరొకరిదో నాకు గుర్తులేదు. నా పదో ఏట మొదలు పెట్టి సుమారు ఒకటీ ఒకటిన్నర ఏళ్ల పాటు ఆ పుస్తకం అప్పుడు కాస్తా అప్పుడు కాస్తా చదువుతూ పూర్తి చేశాను. అందులో ధ్రువుడు, ప్రహ్లాదుడు, ఆంజనేయుడు, అంబరీషుడు లాంటి పౌరాణిక భక్తులు మొదలుకొని, చారిత్రక మధ్యయుగాల నాటి శంకరుడు, రామానుజుడు, నామదేవుడు, జ్ఞానదేవుడు, కబీరు, మీరాబాయి, సక్కుబాయి లాంటి భక్తులతో పాటు ఆధునిక కాలపు తిలక్, మాలవ్యా, గాంధీలాంటి దేశభక్తుల వరకు ఎందరెందరో మహావ్యక్తుల జీవిత కథలుండేవి. చక్కని సులభశైలిలో, ఆసక్తికరమైన కథనంతో రాసిన ఆ గ్రంథం నేను ఎన్నిసార్లు మళ్లీ మళ్లీ చదివానో లెక్కలేదు. తెలుగు సాహిత్యం మీద నాకు అభిరుచి కలిగించిన మొదటి పుస్తకం అది. తెలుగుభాషమీద నాకు ఏ కొంచెమైనా పట్టు కలిగిందనుకుంటే అందుకు తోడ్పడిన మొదటి గ్రంథం కూడా అదే.

ఆరోజుల్లో మా పెత్తండ్రి డాక్టర్ నండూరి శివరావుగారు గుడివాడలో ఒక ప్రచురణాలయం స్థాపించి, ద్విజేంద్రలాల్‌రాయ్ బెంగాలీ నాటకాలు 'చంద్రగుప్త, రాణా ప్రతాపసింహ, దుర్గాదాసు, భీష్మ' మొదలైన వాటిని తెనుగించి ప్రచురిస్తూ వుండేవారు. వాటిలో అమ్ముడుపోయినవి పోగా మిగిలిపోయిన ఒక్కొక్క పుస్తకం ఇరవై, ముప్పైదాకా ప్రతులు కట్టలు కట్టలుగా కృష్ణాజిల్లా ఆరుగొలనులో మా ఇంట్లో అటక మీద చెదలు పట్టడానికి సిద్ధంగా పడి వుండేవి. వాటిని ఒకసారి యాదృచ్ఛికంగా చూశాను. తేళ్లకు, జెర్రులకు కూడా వెరవక చీకటి కోణంలాంటి ఆ అటక ఎక్కి ఒక్కొక్క నాటకం ప్రతిని తీసుకుని చదివేవాణ్ణి. ద్విజేంద్రలాల్ నాటకాలకు షేక్స్పియర్ నాటకాలు ఒరవడి. అవి ఆ రోజుల్లో ప్రజల్లో దేశభక్తిని ప్రభోదిస్తూ, జాతీయోద్యమానికి కూడా పరోక్షంగా తోడ్పడ్డాయి. అవన్నీ పాటలు, పద్యాలు లేని వచన నాటకాలు.

ద్విజేంద్రలాల్ సాహిత్యంలో ఆయన నాటకాలన్నీ ఒక ఎత్తు. కాళిదాసును, భవభూతిని తులనాత్మకంగా పరిశీలిస్తూ రాసిన విమర్శాగ్రంథం ఒక ఎత్తు. దాన్ని జంధ్యాల శివన్న శాస్త్రిగారు "కాళిదాస భవభూతులు" అనే పేరుతో ఆంధ్రీకరించారు. దాని ప్రతులు కూడా మా ఇంట్లో అటకమీద వుండేవి. నా చిన్నతనంలో నా అభిమాన గ్రంథాలలో అగ్రగణ్యమైనది ఆ "కాళిదాస భవభూతులు". ఒక పది పదిహేనేళ్లపాటు దాన్ని ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. ఆ తర్వాత కాలంలో కాళిదాస, భవభూతులు నాటకాలపై ఎందరో విమర్శాగ్రంథాలు రాశారు. కానీ, ద్విజేంద్రలాల్ గ్రంథంతో పోల్చదగింది మరొకటి లేదని ఇప్పటికీ నా దృఢ విశ్వాసం. గ్రీకు, లాటిన్, ఇంగ్లీషు నాటకాలతో సహా మొత్తం ప్రపంచ నాటక సాహిత్యమంతటినీ ప్రస్తావిస్తూ కాళిదాసు, భవభూతి నాటకాలను, ముఖ్యంగా అభిజ్ఞాన శాకుంతలం, ఉత్తర రామచరితం నాటకాలను సవిమర్శంగా ఆయన విశ్లేషించారు. నేను సంస్కృతం నేర్చుకోకపోయినా, అనువాదాల ద్వారా సంస్కృత నాటక, కావ్యసాహిత్యం మీద నాకు అభిరుచి, అభిమానం కలిగించిన ఏకైక గ్రంథం.

మా పెత్తండ్రి శివరాం గారికి చెందిన "భారతి" పాత ప్రతుల కట్టలు, తెలికిచర్ల వెంకటరత్నంగారు సంపాదకులుగా తెనాలి నుండి నవ్యసాహిత్య పరిషత్తువారు ప్రచురిస్తూ వుండే "ప్రతిభ" ప్రతుల కట్టలు అన్నీ బూజు దులిపి తీసి అత్యంత శ్రద్ధాసక్తులతో చదువుతూ వుండేవాణ్ణి. అవి నవ్య సాహిత్యం మీద నాకు చక్కని అభిరుచిని, అభిమానాన్ని కలిగించాయి. ఆ రోజుల్లో అంటే 1938, 39, 40 సంవత్సరాలలో ఆ రెండు పత్రికలతో పోల్చదగిన స్థాయిలో మరొక సాహిత్య మాసపత్రిక వస్తూ వుండేది. అది "వీణ" పత్రిక. ఆరుగొలను గ్రామానికి నాలుగైదు మైళ్ల దూరంలోని తేలప్రోలులో మా అమ్మగారి మేనమామ పాటిబండ్ల

మాధవశర్మగారు ఒకవైపు "ఉదయభారతి" గురుకులం నడుపుతూ, మరొకవైపు "వీణ" మాసపత్రిక నడుపుతూ వుండేవారు. వేసవి సెలవుల్లో తెలప్రోలులో మా బంధువుల ఇంటికి వెళ్లినప్పుడల్లా "వీణ" సంచికలు సంపాదించి చదివేవాణ్ణి. దాని సంపాదకవర్గంలో శ్రీరంగం శ్రీనివాసరావుగారొకరు చలం సాహిత్యసృష్టిలో ఒక ప్రత్యేక విశిష్ట సాధనాన్ని సంపాదించుకున్న "మ్యూజింగ్స్" రచన "వీణ"లోనే ప్రారంభమై చాలా ఏళ్లు నడిచింది. వీర గ్రాంథికవాది విశ్వనాథవారు శిష్టవ్యవహారిక భాషలో రాసిన మొదటి నవల "హాహా హూహూ" "వీణ"లోనే సీరియల్‌గా వస్తూ వుండేది. శ్రీశ్రీ "మహాప్రస్థానం" గీతాలలో కొన్ని వీణలోనే వచ్చాయి.

ఇవన్నీ నా హైస్కూల్ విద్యార్థిదశ రోజుల ముచ్చట్లు. ఆ రోజుల్లో ఉబుసుపోక పాంచఖడీదేవ్ అపరాధ పరిశోధక నవలల అనువాదాలు, మాయావి, మనోరమ, వాడే వీడు (శ్రీశ్రీ దృష్టిలో "వాడే వీడు" ఠాగూర్ గీతాంజలి కంటే గొప్ప రచన), ఇంకా పేటికాంతరశవం, చోరాగ్రేసర చక్రవర్తి లాంటి ఎంతో చెత్తాచెదారం నేను చదవకపోలేదు కానీ, నా మొగ్గు పూర్తిగా సీరియస్ లిటరేచర్‌వైపే. ఉన్నవ వారి మాలపల్లి, చలంగారి మైదానం, బ్రాహ్మణీకం, శశాంక, పురూరవ, కొడవటిగంటి, మొక్కపాటి వంటి వారి కథలు, నవలలు, కృష్ణశాస్త్రి గారి కృష్ణపక్షం, వేదులవారి దీపావళి, కాటూరి పింగళి సౌందరనందం లాంటివి నా పఠనదాహాన్ని తీరుస్తూ వుండేవి. అన్నట్లు అప్పట్లో నా అభిమాన గ్రంథాల్లో చాలా ముఖ్యమైనది విశ్వనాథవారి వేయిపడగలు. 1930-40 ప్రాంతంలో బెజవాడ నుంచి విశ్వనాథ వెంకటేశ్వర్లుగారు తమ అన్నగారి గ్రంథాలను మా వూరు తీసుకువచ్చి కొందరికి విక్రయించినట్టు లీలగా గుర్తు. 'వేయిపడగలు" ఖరీదు 5 రూపాయలు. ఆవిధంగా నా చేతికందిన "వేయిపడగలు" నవల నేను 5వ ఫారమ్ చదివేరోజుల్లో మొదటిసారిగా చదివాను. మొదటిసారి చదివినప్పుడు వర్ణనలు వగైరా వదిలేసి కథాభాగం మాత్రం రెండుమూడు రోజుల్లో గబగబా చదివేశాను. ఆ తర్వాత వర్ణనలు, సాహిత్య చర్చలు, గిరకనృత్యంతో సహా ఆమూలాగ్రం నాలుగైదుసార్లయినా చదివుంటాను. ఆ నవల చదివినప్పుడల్లా తెలుగు ప్రాంతపు ప్రకృతిని అంత అద్భుతంగా వర్ణించిన కవి మరొకరు లేరనిపించింది.

ఆ తర్వాత చాలా ఏళ్లకు ఆంధ్ర పత్రికలో మహారచయిత కొడవటిగంటి కుటుంబరావుగారికి నేను సహోద్యోగినైనప్పుడు, ఆయనకూ నాకూ "వేయిపడగలు" నవలపై అప్పుడప్పుడూ వాదోపవాదాలు జరుగుతూ వుండేవి. దాన్ని వర్ణాశ్రమ వ్యవస్థను, బూజుపట్టిన జమిందారీ వ్యవస్థను సమర్థించే అభివృద్ధినిరోధక నవలగా కుటుంబరావుగారు ఘాటుగా విమర్శించేవారు. సాంఘికదృష్టి నుండి ఆయన విమర్శ సహేతుకమేనని అంగీకరిస్తూనే సాహిత్య దృష్టినుంచి అది గొప్ప నవల అని వాదించేవాణ్ణి. ఒక రచయిత, సిద్ధాంతాలు, విశ్వాసాలు, ఎలాంటివైనా వాటిని అంగీకరించలేకపోయినా, సాహిత్యపు మంచిచెడ్డలను సాహిత్యదృష్టి నుంచే చూసి అంచనా వేయాలన్నది నా వాదం. ఇందుకు ఒక ఉదాహరణగా టాల్‌స్టాయ్ "వార్ అండ్ పీస్"ను తీసుకోవచ్చు. ఆ నవలలో టాల్‌స్టాయ్ చరిత్రను గురించి, చారిత్రక మహా వ్యక్తుల గురించి, చారిత్రక శక్తుల గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలతో, సిద్ధాంతాలతో ఏకీభవించలేని వారు కూడా దాన్ని ప్రపంచపు ఉత్తమోత్తమ నవలగా పరిగణిస్తారు. అలాగే కొందరు "వేయిపడగలు"లో నవలా శిల్పం దెబ్బ తిన్నదని విమర్శించడం కద్దు. కానీ ఈ విమర్శ "వార్ అండ్ పీస్"కూ వర్తిస్తుంది. రోమా రోలా పది సంపుటాల గొప్ప నవల "జాక్రిస్తోఫే"కూ వర్తిస్తుంది. అటువంటి వాటిని సాధారణ నవలల దృష్టితో చూడరాదు. మన దేశంలో పాత వ్యవస్థ అంతరిస్తూ, కొత్త వ్యవస్థ అవతరించడానికి ఆయత్తమవుతున్న సంధిదశలో కొత్తపాతల సంఘర్షణను ఒక గ్రామీణ నేపథ్యంలో నుంచి విశ్వనాథవారు ఆ నవలలో చిత్రించారు. ఆయన విశ్వాసాలలో మనం అంగీకరించలేనిది చాలా వుంది. కానీ ఆయన చిత్రించిన జీవితం, సమాజం, పాత్రలు అన్నిటిలో వాస్తవికత ఉట్టిపడుతూ వుంటుంది. ఆయన సిద్ధాంతాలకు అతీతమైన చిత్రణ అది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఆనాటి నా అభిమాన గ్రంథాలలో 'వేయిపడగలు' ముఖ్యమైనది.

నాకు ఇంగ్లీషు సాహిత్యంపట్ల అభిరుచి, పఠనాశక్తి కలిగించిన వారిలో ఒకరు అప్పట్లో రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్ నరసింహ అయ్యంగార్. మాకు కింగ్‌లియర్ ట్రాజెడీగా, టెంపెస్ట్ కామెడీగా వుండేది. అది మాత్రమేకాక, అంత క్షుణ్ణంగా కాకపోయినా షేక్స్పియర్ ట్రాజెడీలు ఒథెల్లో, మేక్‌బెత్, హామ్లెట్‌ల వంటివి, టెంపెస్ట్‌తో పాటు మిడ్‌సమ్మర్ నైట్స్‌డ్రీమ్, యాజ్‌యూలైకిట్, మర్చంట్ ఆఫ్ వెనిస్ లాంటి కామెడీలు చదవాలి. ఇంకా షేక్స్పియర్ క్రిటిసిజం కూడా చదవాలి అన్నది ఆయన సూత్రం. నేను ఆయన ఉపదేశాన్ని వేదవాక్యంగా పాటించేవాణ్ణి. ఒక వేసవి సెలవుల్లో షేక్స్పియర్ కంప్లీట్ వర్క్స్, మరొకసారి సెలవుల్లో గోల్డెన్ ట్రెజరీ కవితా సంకలనం చదివేశాను. ఠాగూర్ నవల "ది రెక్" మాకు నాన్‌డిటైల్డ్. దాంతోపాటు గోరా నవల, ఠాగూర్ కథలు, గీతాంజలి, గార్డినర్, గ్రేట్ గేదరింగ్ లాంటి కవితా సంపుటాలు చదివేశాను. ఆ రోజుల్లో రాజమండ్రి కాలేజీ లైబ్రరీ, గౌతమీ గ్రంథాలయం ఈ రెండూ నాకు రెండు దేవాలయాల్లా వుండేవి. అప్పట్లో మా కాలేజీ లైబ్రరీ నుంచి తీసుకుని నా ఎకనామిక్స్ గ్రూపుతో ఏ సంబంధంలేని సర్‌జేమ్స్ జీన్స్ ఖగోళశాస్త్ర గ్రంథాలు "ది యూనివర్స్ ఎరౌండ్ అజ్", "ది మిస్టీరియస్ యూనివర్స్" ఎంతో ఆసక్తితో చదివాను. అప్పట్లో పాపులర్ సైన్సు పట్ల కలిగిన ఆసక్తే తర్వాత కాలంలో "విశ్వరూపం", "నరావతారం" గ్రంథాలు రాయడానికి నాకు ప్రేరణ ఇచ్చింది. ★

నా చిన్నతనంలో నా అభిమాన గ్రంథాలలో అగ్రగణ్యమైనది ఆ "కాళిదాస భవభూతులు". ఒక పది పదిహేనేళ్లపాటు దాన్ని ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. ఆ తర్వాత కాలంలో కాళిదాస, భవభూతులు నాటకాలపై ఎందరో విమర్శాగ్రంథాలు రాశారు. కానీ, ద్విజేంద్రలాల్ గ్రంథంతో పోల్చదగింది మరొకటి లేదని ఇప్పటికీ నా దృఢ విశ్వాసం. గ్రీకు, లాటిన్, ఇంగ్లీషు నాటకాలతో సహా మొత్తం ప్రపంచ నాటక సాహిత్యమంతటినీ ప్రస్తావిస్తూ కాళిదాసు, భవభూతి నాటకాలను, ముఖ్యంగా అభిజ్ఞాన శాకుంతలం, ఉత్తర రామచరితం నాటకాలను సవిమర్శంగా ఆయన విశ్లేషించారు. నేను సంస్కృతం నేర్చుకోకపోయినా, అనువాదాల ద్వారా సంస్కృత నాటక, కావ్యసాహిత్యం మీద నాకు అభిరుచి, అభిమానం కలిగించిన ఏకైక గ్రంథం.



కవిత్వమ్

మహోదయం కలగంటున్నాను

మట్టికి నమస్కరిస్తున్నాను
నల్లరేగడి ఎర్రరేగడి
ఎడారినేల చిత్తడినేల
నేల ఏదైతేనేం...?
కృషి నిరంతరమైతే
స్వప్నం నిజమౌతుంది
అతివృష్టిలో
తలమునిగిన వరి పైరు
నల్లరేగడి నేలలో
తనువు చాలించక చిరంజీవై
పసిడిరాశులు పండించింది!
ఎర్రరేగడి చిక్కిశల్యమై
అనావృష్టిలో మొక్కల్ని
ఉదరంలో దాచి
పంటలు పండించింది
శాస్త్ర సాంకేతికాలు
చదివిన చౌడు భూమి
గడ్డి మొలవని మట్టిలో
హరితం పరిచింది
బండల మాటున కొండల్లో
మొలిచిన మొక్కలు
వటవృక్షాలై నింగికి నిచ్చెనలయ్యాయి!

నేల ఏదైతేనేం....?
మట్టికి నమస్కరిస్తున్నాను
మట్టి శిల్పించిన మనిషికి
నమస్కరిస్తున్నాను
అకృతబుద్ధి అల్పబుద్ధి
వక్రబుద్ధి దుష్టబుద్ధి
మానవకళ్యాణానికి
మనిషిని మారమంటున్నాను!
చందమామలో నూలు వడుకుతుంది
పేదరాశి పెద్దమ్మ అంటుంది అకృతబుద్ధి
పరీక్ష రాయలేక
పక్క పేపరుపై కన్నేస్తుంది వక్రబుద్ధి
తనదికాని సంపదను
తనదంటూ కబళిస్తుంది దుష్టబుద్ధి
శ్రీరంగనీతులు వల్లెవేసి
మత్తులో జోగుతుంది అల్పబుద్ధి!
బుద్ధి ఏదైతేనేం....?
మార్పు శ్రీకారమైతే
మహోదయం కలగంటున్నాను
మనిషికి నమస్కరిస్తున్నాను!

- అడిగోపుల వెంకటరత్నమ్

అంజాన్ షాయర్

ఆఖరికి
అడగనే అడిగావు కదరా!
మాసిన చేతి రుమాలుతో
జిడ్డు కారుతున్న
ముఖాన్ని తుడుచుకుంటూ
అద్దాన్నే బద్ధలు కొట్టావు కదరా!

మంచి కవిత్వం రాస్తావు
గొప్ప కథకుడివని మెప్పుపొందావు
ఒంటరిగా వున్నప్పుడు
ఎంత వికారంగా కనిపించావురా!

అఖరికి
అడగనే అడిగావు కదరా!
ఊసు కళ్ళమీది
దోమల్ని తోలుకుంటూ
మనసునే మరక చేశావు కదరా!

సిద్ధాంతాలు మాట్లాడుతావు
నిబద్ధత గురించి చెపుతుంటావు
నీ దాకా రాగానే
ఉద్యమం మీద
విషం కక్కావు కదరా!

అఖరికి
అడగనే అడిగావు కదరా!
కారుతున్న ముక్కును చీది
చేతి మట్టకు రాసుకొంటూ
గాలిని కూడా
గలీజు చేశావు కదరా!

కార్మికుల గురించి
నాటకాలు వేస్తావు
ఊరేగింపుల్లో
పాటలు పాడతావు
నాలుగు నిమిషాల సీనులోనే
అసహ్యకరమైన భంగిమలో



బయటపడ్డావు కదరా!

అఖరికి
అడగనే అడిగావు కదరా!
ఈకల్లేని బోడిగుండును
గీసిన అగ్గిపుల్లతో గోక్కుంటూ
భయంకరంగా
ఇకిలించావు కదరా!

నీ ముసుగుకు నిప్పంటించా!
నీ వేషం మీద కారం నీళ్ళుచల్లా!
వేదికలు మారుస్తూ
బతక నేర్చావు కదరా!

అఖరికి
అడగనే అడిగావు కదరా!
అడుక్కు తెచ్చుకొన్న
పుస్తకాల్ని సర్దుకొంటూ-
"విప్లవం వస్తుందా?"
"మార్క్సిజం బతికుందా?"అంటూ
ఎంత వెటకారంగా చుశావురా!

అఖరికి
అడగనే అడిగావు కదరా!

- ఆశారాజు

సినిమా కబుర్లు



తెలుగు తెర ఆనంద బ్రహ్మా

ఏ సినిమాకు వెళ్దాం?
ఫలానా సినిమా
బాగుంటుందా?
బ్రహ్మానందం వున్నాడు కదా...

ఆయన పాతికేళ్ల హాస్య రసానందమై, ప్రేక్షకుల హృదయానందమై, నిర్మాతల కనకానందమై అలా అలా అలరారుతూ రజతోత్సవ సన్నివేశం చేరుకున్నారు. ఓ ఎనిమిది వందల పైచిలుకు చిత్రాలు చేసేసి సహస్రాధికానికి సాగిపోతున్నారు. కమెడియన్ అని ద్వితీయ స్థానంలోకి నెట్టేసే విదూషక పాత్రను తారాపథంలో నిలిపి నిన్నటి హాస్య నట చక్రవర్తుల సరసన తిరుగులేని పీఠం వేసుకున్నారు. తలుచుకుంటే చాలు నవ్వొచ్చేంత బలంగా ప్రేక్షక జన ప్రేమ పాత్రుడైపోయారు. ఆనందంలో బ్రహ్మానంద శైలి సృజించి మరెవరూ దరిదాపుల్లో రాకుండా కొండెక్కి కూచున్నారు.

కస్తూరి శివరావు తెలుగు కమెడియన్లలో మొదటి ప్రసిద్ధుడు. తర్వాత రేలంగి, రాజబాబు, అల్లు రామలింగయ్య, పద్మనాభం రమణారెడ్డి, బాలకృష్ణ, పేకేటి, వేలు, వీరభద్రరావు తదితరులు. కొన్ని చిత్రాల్లో ప్రధానంగా కనిపించినా తర్వాత కనుమరుగైన వారు, పెద్దగా ప్రకాశించలేక పరిమితుల్లో వుండిపోయిన వారు ఇంకా అనేకులు. హీరోలుగానూ వేస్తూనే హాస్యం పండించిన వారు మరికొందరు. ప్రసిద్ధి పరంగా వీరందరిలో అగ్రగణ్యులు రాజబాబు, రేలంగి. ఆ తర్వాత అంతకంటే ప్రఖ్యాతి పొందింది నిస్సందేహంగా బ్రహ్మానందమే. హాస్యానికి ఆయన కొత్త నిర్వచనమై నిలిచాడు. సన్నివేశానికో సంభాషణలకో పరిమితమైన హాస్యాన్ని హావభావాల వైపు మరల్చడమే ఆయన ప్రత్యేకత, ప్రతిభ కూడా. రాజబాబు కనిపించగానే జనం నవ్వేవారు. ఆయన నటనలో హడావుడి, కంగారు అందుకు ప్రధాన కారణం. ఎవరినో పిలుస్తూ సోఫాల కింద వెతకడం, 'అయ్ బాబోయ్' అనడం ఇవన్నీ రాజబాబు శైలి. రేలంగి, రమణారెడ్డి వంటి వారిది ప్రధానంగా సన్నివేశ గతమైన హాస్యం. ఒకరికి తెలియకుండా ఒకరు రావడం, దొరికి పోవడం, మీద పిండి పోసుకోవడం, మాటలతో మస్కా కొట్టడం ఇలాంటివే వారి పాత్రల్లో ప్రధానం. జంధ్యాల సృష్టించిన సుత్తివేలు-వీరభద్రరావులు కూడా ప్రధానంగా సంభాషణా ప్రధానమైన హాస్య నటులే. వారి తర్వాత ఆయన అందించిన బ్రహ్మానందం మాత్రం ఈ అన్ని లక్షణాలనూ కలబోసుకున్న విశిష్ట కళామూర్తి. ఆయన హాస్యాభినయాన్ని ఒక మూసలో కుదించడం సాధ్యం కాని పని. ఆ విధంగా ఆయన తన సృష్టికర్త జంధ్యాల గీసిన గీతలను దాటిపోయి నవ్వుల నట చక్రవర్తిగా ఎదిగాడు.

1985 ఫిబ్రవరిలో 'తాతావతారం' చిత్రం ద్వారా తెరంగేట్రం చేసిన బ్రహ్మానందం తొలిసారిగా ప్రేక్షకుల దృష్టిలో పాతుకుపోయింది 'అహ నా పెళ్లంట' చిత్రంతో. అంతకు ముందు ఆయన ఏడు చిత్రాల్లో నటించాడు. అవన్నీ చిన్నా చితక పాత్రలే. కాని వాటిలోనే ఎక్కడో ఆయనలోని ప్రతిభా విశేషం ప్రకాశించి వుండబట్టి రామానాయుడు వంటి ప్రథమ శ్రేణి నిర్మాత కంట్లో పడ్డాడు. 'అహ నా పెళ్లంట'లో పిసినారి కోట సహాయకుడి పాత్రలో నటించడానికి వేలుకు ఖాళీ లేకపోవడంతో ఈయనను రప్పించి అరగుండు అన్నారు. అంతే.. ఆయన తెలుగు వారి కడుపులో నొప్పి తెప్పించే పెద్ద గుండులా వుండిపోయారు. అంతకు ముందు హాస్యం అంటే ఏ సన్నివేశాలో, డైలాగులో గుర్తు చేసుకునే వారు ప్రేక్షకులు. కాని బ్రహ్మానందం అనే పేరు గుర్తుకువస్తే చాలు పరిశుభ్రమైన నవ్వుల జల్లు కురిసినట్టు అనుభూతించే స్థితికి చేరారు.

ఇంతకూ ఈ బ్రహ్మానందుడంటే ఏమిటి? తను కంగారు పడుతూ ఎదుటి వారిని కంగారు పెట్టే కంగాళీ పెద్ద మనిషా? అర్థంపర్థం లేకుండా మాట్లాడుతూ అవతలి వారి మెదడు తినేసి కిందపడేలా చేసే అమాయకుడా? లేక అవతలి వారి మాటలకు తనే కిందపడి గిజగిజ కొట్టుకునే అర్భకుడా? గుడ్డలు చించుకుని పరిగెత్తే విచిత్ర వర్తనుడా? మేకపోతు గాంభీర్యం చూపించే బడాయి బాబాయా? ఉత్తుత్తి కోపంతో వూగిపోతూ వూపిరాడకుండా తిట్ల దండకం చదివే ముక్కోపి స్వరూపుడా? చేతగాని చేష్టలతో వెర్రినవ్వులతో నెట్టుకొచ్చే వెంగళప్పా? భార్యను అనుమానించే సందేహ మందేహుడా? భార్యను చూసి వణికిపోయే భయస్తుడా? చిరంజీవిలా వున్నావంటే నమ్మేసి చిందులేసే మతిలేని దాదానా? నెల్లూరు పెద్ద రెడ్డి పేరు చెప్పి దందా చేసే చోటా చోరుడా? అడ్డగోలు పాఠాలు చెప్పే అవివేకపు ఆచార్యుడా? అక్షర శుద్ధి లేని అజ్ఞానపు అయ్యవారా? తరాల అంతరాలు లేకుండా కథానాయకుల పక్కన నిలబడి వారి విజయాలకు నవ్వుల వత్తాసు నిచ్చే విదూషక శేఖరుడా?

చెప్పాలంటే ఇవన్నీ వినోదాల బ్రహ్మానందుడి విశ్వరూపాలు. అర గుండు నుంచి అనంతంగా సాగుతున్న హాస్య యాత్రలో అన్నీ రసగుళికలే. తెలుగు తెరను అంతగా నవ్వులతో అలంకరించి హాస్యాభిషేకం చేసిన సార్థక నటుడు బ్రహ్మానందం నట జీవిత రజతోత్సవం కళాభిమానులకూ హాస్య ప్రియులకూ మహదానందకర దృశ్యం.

'మనీ, లిటిల్ సోల్జర్స్, నువ్వు నాకు నచ్చావ్, వినోదం, బావగారూ బావున్నారా, సంతోషం, మన్మధుడు, పోకిరి, భళారే విచిత్రం, అనగనగా ఒక రోజు, జల్సా, ఆయనకు ఇద్దరు' చెప్పాలంటే ఉదాహరణలూ ఉటంకింపులూ అక్కర్లేనంతగా జన హృదయాల్లో ఆయన పాత్రలు ముద్రితమైపోయాయి. అరుదుగా అయిష్టంగా తప్ప హాస్యంలో అశ్లీలత రానివ్వని ప్రతిభా సంపన్నుడు రావడం వల్ల తెలుగు సినిమా హాస్యం కొత్త పుంతలు తొక్కింది. తర్వాత వచ్చిన సుధాకర్, అలీ, సునీల్, వేణు మాధవ్, నరేష్, ధర్మవరపు, ఎంఎస్ నారాయణ తదితరులందరి చేరికతో హాస్య రసావిష్కారం పరిపూర్ణమైందంటే అందుకు నాంది ప్రస్తావకుడు మాత్రం బ్రహ్మానందమే. తేదీలలో ముందు వెనకలు ఎలా వున్నా ఆయన వచ్చాక హాస్యపు వరవడి మారింది. పరిధి పెరిగింది. జీవితంలో పెరిగిన వేగం, వైవిధ్యం, కపటత్వం, బూటకత్వం, పిరికితనం, మురికితనం వీటన్నిటినీ వ్యంగ్య హాస్య భరితంగా పొట్టల్లో కూరి కూరి గిలిగింతలు పెట్టే బ్రహ్మానందం మరో పాతికేళ్లు ఇలాగే నవ్వుల జల్లుల్లో ఓలలాడించాలని కోరుకుందాం... అందుకోసం ఈ నవ్వుల ఖజానాకు ఇచ్చిన నజరానాలే పద్మశ్రీ, డాక్టరేట్, గిన్నీస్ రికార్డు... అవే పాత్రలు అంతగా వేసి వేసి విసుగెత్తలేదా అని విలేకరి అడిగితే అదేం లేదు అంటూనే మీకో రహస్యం చెబుతాను.. డబ్బులు కూడా ఇస్తారు కదా అని కొంటెగా అనగల ఆయన నిజానికి హాస్య రస రహస్యాలను ఔపోసన పట్టేశాడు మరి!

..... నవ్వహో బ్రహ్మానందం!

- తెర

కథ

కాలేజీ



- జి. అనసూయ

జూనియర్ కళాశాల ఆవరణంతా నిశ్శబ్దంగా ఉంది. విశాలమైన స్థలంలో గంభీరంగా ఉన్న రెండంతస్థుల బిల్డింగ్ అది. చుట్టూ అశోక, గుల్‌మోహర్, నీలగిరి చెట్ల నీడలు. పదేళ్లక్రితం ఆ భవనం స్థానంలో రేకుల షెడ్లు ఉండేవి. క్లాసు రూములు సరిపోయేవి కావు. చెట్లకింద, వరండాలలో ఎక్కడ పడితే అక్కడ క్లాసులు చెప్పేవారు. ఒక్కొక్క క్లాసుకు రెండు మూడు సెక్షన్లు ఉండేవి. కిక్కిరిసి ఉన్న తరగతి గదుల్లో పోటా పోటీగా బోధన జరిగేది. ఆ కాలేజీలో సీటు రావడమే తమ అదృష్టంగా భావించేవారు విద్యార్థులు. క్రమంగా సీను మారింది. లెక్చరర్లకు ఇతర వ్యాపకాలు ఎక్కువయ్యాయి. కాలేజీలో చదువు చెప్పడం కంటే ట్యూషన్లు, ట్యుటోరియళ్లు నడపడం లాభసాటిగా మారింది. నలుగురు సైన్సు లెక్చరర్లు కలిసి ఏకంగా ఓ కాలేజీ పెట్టుకున్నారు. అట్లా ఒక్కటేంటి. అయిదారు ప్రయివేటు కాలేజీలు తయారయ్యాయి. అంతకు ముందు ఏళ్ల తరబడి విద్యార్థులు చేసిన ఆందోళనల ఫలమైతేనేం. స్థానిక ఎమ్మెల్యే తన పలుకుబడిని పెంచుకోవడానికైతేనేం. ప్రభుత్వ కాలేజీకి బిల్డింగు శాంక్షనయింది. శంకుస్థాపనయినప్పటి నుండి ఓపెనింగ్ అయ్యేటప్పటికి నాలుగేళ్లు పట్టింది. ఇంతలో కాలం మారిపోయింది.

నాలుగు సెక్షన్లు పోయి ఒక్క సెక్షన్‌కే పిల్లలు రావడంలేదు. రిటైరయిన లెక్చరర్ల బదులు కాంట్రాక్టు లెక్చరర్లను పెడుతున్నారు. ప్రయివేటు కాలేజీల్లో ఎదురు డబ్బులిస్తున్నారని, చదువు బాగా చెప్తున్నారని పిల్లలంతా అటే పోతుండడంతో ఇంగ్లీష్ మీడియం సెక్షనే ఎత్తేశారు.

ఇప్పుడు ఆ కాలేజీ పని అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్టైంది. క్లాసుకు ఇరవై ముప్పయి కంటె లేరు. వున్న వాళ్లు కూడా సరిగ్గా రారు. అందుకే పిల్లలున్నారా లేరా అన్నట్లుంది కాలేజీ.

మూణ్ణెల్ల పరీక్షలు జరుగుతున్నాయి. పొద్దున దాకా చదివించి మధ్యాహ్నం పరీక్ష పెడ్తున్నారు. క్లాసుల్లో పిల్లలు చదువుకుంటుంటె సెంట్రీల్లాగా కర్రలు పట్టుకొని అక్కడిక్కడికి తిరుగుతున్నారు పీడీ సారు, లైబ్రరీ సారు. ముందరి హాల్లో కుర్చీలు వేయించుకొని కూర్చొని పేపర్లు దిద్దుకుంటున్నారు కొందరు లెక్చరర్లు....

"ఏంది సార్ గీ కర్మ. గీ పరీక్షలు. గీ దిద్దుడు. అంత స్కూల్ల లెక్క అయిపోయింది" స్కూల్ అసిస్టెంట్ నుండి ప్రమోషన్ మీద వచ్చిన బిక్షం సార్ వాపోయిండు.

"ఇంతకు ముందు ఇట్ల లేకుండ ఏదో ఒక్కపూట ఉండేది కాలేజి. ఎవని క్లాసులు వాడు జెప్పుకునుడు బయటపడుడు. పోరగాండ్లు కొందరు అడ్మిషన్లప్పుడు వస్తే మల్ల పరీక్షలప్పుడే కాలేజి మొఖం జూసెటోళ్లు" అన్నడు సీనియర్ లెక్చరర్ ఉత్తమ్‌కుమార్.

"గప్పుడు ఇసొంటి కమిషనర్ ఏడున్నడే" అన్నడు మరో లెక్చరర్ నిరంజన్.

"నిజమే ఈ కమిషనర్ ఎన్నాళ్ళుంటడోగాని నిద్రబట్టనిస్తలేడు" అంటుండగానే అటెండరు నోటీసు తీస్కొచ్చిండు.

మూడు రోజులల్ల పేపర్లు దిద్ది మార్కుల లిస్టులు పంపించాలట. టార్గెట్లు పెట్టుకొని ... ఆమేరకు పిల్లలకు స్పెషల్ క్లాసులు తీసుకోవాలట. కళాశాల ఎ.జి.ఎం.సి. పంపించిన నోటీస్.

"ఈ ఎ.జి.ఎం.సి. ఏందే కమిషనర్ కంటె ఎక్కువయింద్రు" బోటని లెక్చరర్ ప్రసాద్ అన్నడు.

"ఆయన మాత్రం ఏం జేస్తడే పైనుండి షంటింగు గట్టుండె" అన్నడు నిరంజన్.

"నా సబ్జెక్టుల అసలు ఎవ్వడు పాసయ్యేటట్టె లేడే" ఫిజిక్స్ లెక్చరర్ శ్రీనివాస్ అన్నాడు.

"అది ముందే భౌతిక శాస్త్రం. అందుకే అంటరు దాన్ని బహుతిక్క శాస్త్రం అని" తన జోక్‌కి తానే నవ్విండు తెలుగుసార్.

"ఆ... ఏ సబ్జెక్టు మాత్రం ఏం పాసయ్యేటట్లున్నరులే. ఒన్ బై టూ అంటే మూడని రాసిండు, మా ఎమ్.పి.సి. స్టూడెంటు" మాథ్స్ సార్ మధు వాపోయిండు.

ఇంగ్లీష్ లెక్చరర్ కృష్ణారావు హడావిడిగా వస్తూ 'హల్లో, హల్లో' అంటూ అందరికీ షేక్ హ్యాండిస్తూ లోపలికి వెళ్ళి అటెండెన్స్ రిజిస్టరులో సంతకం చేసి అంతే హడావిడిగా వెళ్ళిపోయాడు.

"ఈ సార్ పేపర్లెప్పుడు దిద్దుతడు. ఎప్పుడు చూసినా ఉరుక్కుంట వస్తడు. ఉరుక్కుంట పోతడు" హిస్టరీ లెక్చరర్ అశోక్ అనుమానం.

"దిద్దుడా, పాడా. ఆఖరి రోజు క్లాసుల కూర్చొని ముఖాలు చూసి లిస్టుల మార్కులు ఏస్తడు" అన్నడు సివిక్స్ లెక్చరర్ శ్రీరామ్.

"జర గీ పేపరు జూడె వీడేం రాసిండో తెలుస్తలేదు" హిస్టరీ లెక్చరర్ దిద్దుతున్న పేపర్ తీసి జూపిచ్చిండు. పక్కనే ఉన్న ప్రసాదు ఆ పేపర్ తీసుకొని నిశితంగా చూసిండు. చూస్తే తెలుగులాగే ఉంది. రాత గుండ్రంగ అందంగానే ఉంది దూరానికి. కాని ఒక్క పదం కూడా అర్థం కాలేదు. అన్ని ప్రశ్నల నెంబర్లు వేసి ఆరు పేజీలు రాసిండు.

కింద మీద ఆసాంతం చూసి "ఇంతకు నీవు ఇచ్చిన ప్రశ్న ఏందే" అన్నడు.

"అశోకుని ఘనతను

వివరించుము. అనేది ప్రశ్న " అన్నడు హిస్టరీ లెక్చరర్.

"మరి అశోకుని పేరు గూడ ఏడ కనిపిస్తలేదు" ప్రసాద్ ఇంకా వెతుకుతూ అన్నడు.

"అదేనే నేను గూడ పరిషాన్ అయితున్న. ఒక్క ముక్క గూడ అర్థం కాకుండ ఆరు పేజీలు రాసిన ఈ ఘనుడు, పదో తరగతి ఎట్ల పాసైండా అని, గీ పేపర్లను కమిషనరుకు పంపించి గీ పోరగాండ్లకు సదువు చెప్పమనాలె. ముప్పయి వేల రూపాయలు ఇచ్చి మెరిట్ పిల్లలను కార్పోరేట్ కాలేజిలల్ల జేర్పించుడు కాదు. గిసొంటి పిల్లలకు సదువు జెప్పి రిజల్టు తీస్కొస్తే అది గొప్ప !! గదెందుకు జేస్తడు గల్లికొక్క ప్రయివేటు కాలేజి ఇచ్చి సర్కారు కాలేజిలను దివాల తీయించి ఈ నోట్ల అక్షరం ముక్కరాని పోరగాండ్లకు చదువు జెప్పి టార్గెట్ పెట్టి రిజల్టు తెమ్మంటె యాడ్నుంచి తెస్తం" అన్నడు అశోక్ అవేదనగా.

"గదంత కాలేజిలు ఎత్తేసే కుట్రలో భాగమే.. అవునూ .. ప్రిన్సిపాల్ రాలేదేందే... " అన్నడు ప్రసాద్.

"సార్, ఈ మూడు రోజులు కమిషనర్ ఆఫీసుల రివ్యూ మీటింగుకు పొయ్యిండు. ఇయ్యాలనో రేపో వస్తడు." నిన్న సాయంత్రం మన జిల్లా నాయకుడు కనిపించి రివ్యూ మీటింగుల కమిషనరు అడ్డగోలుగ మాట్లాడిండని చెప్పిండు" అన్నడు ప్రసాద్.

"అవునవును. స్కూలు పిల్లలను నిలబెట్టినట్టు నిలబెట్టి రిజల్టు తక్కువ వచ్చిన కాలేజిల ప్రిన్సిపాల్స్‌ను "యూజ్ లెస్ ఫెలోస్. పదిశాతం పన్నెండు శాతం రిజల్టు అని చెప్పడానికి సిగ్గుగా లేదు" అంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడిండట" అన్నడు ఇక్బాల్.

"అడ్మిషన్లని, పరీక్షలని, స్పాట్ వాల్యుయేషని అన్ని డ్యూటీలు మనకే పెట్టి పట్టుమని నూటయాభై రోజులు క్లాసులు నడవవు. మనం ఈడ పరీక్షలు స్పాట్ వాల్యుయేషన్లని బిజీగ ఉంటె ప్రయివేటోడు మార్చి ఎప్రిలల్లనే అడ్మిషన్లు ముగించుకుంటుండె. మెరికల్లాంటి మెరిట్ పిల్లలంత పోయినంక పరిగె ఏరుకున్నట్లు సప్లమెంటరి పిల్లలు మనకొస్తుండ్రి. వాడు ఎదురు పైసలిచ్చి కొనుక్కుంటుంటె నోట్ల మాటరానోడు మనకొస్తుండె. మన కష్టాలు, బాధలు కమిషనరుకు ఏం తెలుస్తయి" అన్నడు సివిక్స్ లెక్చరర్.

"ఇదంత మన స్వయంకృతాపరాధమే. మన లెక్చరర్లు క్లాసులు ఎగ్గొట్టి దునియలున్న దందలన్ని చెయ్య బట్టినంక జనాలు సర్కారు కాలేజిలను నమ్ముకుండయిరి" అశోక్ ఉక్రోషంగ అన్నడు.

"అసలిదంత ఓ కుట్ర, మొత్తం చదువులను మార్కెట్ సరుకును జేసి ప్రయివేటు పరం చెయ్యడం ప్రభుత్వ ధ్యేయం" గోపాల్ ఆవేశంగా అన్నడు.

"మరి కొత్త కొత్త కాలేజీలు పెడ్తుండ్రి గదనే" ప్రసాద్ సందేహం.

"పొలిటికల్ ప్రెజర్ తట్టుకోలేక గవర్నమెంటు ఓట్ల కక్కుర్తితోని కాలేజీలు ఇస్తున్నది కాని జనం మీద ప్రేమతోని కాదు" అన్నడు ఉత్తమ్.

"కాలేజి అంటె ఏమిస్తున్నడు. కాగితం మీద ఓ ఆర్డరు పారేస్తున్నడు. హైస్కూలల్ల ఒక రూమ్, అడుక్కొచ్చుకున్న కుర్చీ, టేబుల్, బతిమాలి బామాలి చేర్పించుకున్న ఇరవై ముప్పయి మంది పిల్లలు. సెక్షనుకు పదిహేను మంది ఉంటేనే కాంట్రాక్టు లెక్చరర్లను ఇస్తమని వాళ్ళు. లెక్చరర్లు లేకుండా పిల్లలెట్ల చేర్తరని వీళ్ళు. ఇంచార్జి ప్రిన్సిపాల్లని నిన్న మొన్న వచ్చిన పొరగాండ్లను పెట్టె వాళ్ళమాట ఎవ్వరికి లెక్కలేకుండె. మధ్యన స్కూల్ ఎడ్యుకేషన్ వాళ్ళతోని పంచాయితీలు...."

"కాలేజి అంటె ఏమిస్తున్నడు. కాగితం మీద ఓ ఆర్డరు పారేస్తున్నడు. హైస్కూలల్ల ఒక రూమ్, అడుక్కొచ్చుకున్న కుర్చీ, టేబుల్, బతిమాలి బామాలి చేర్పించుకున్న ఇరవై ముప్పయి మంది పిల్లలు. సెక్షనుకు పదిహేను మంది ఉంటేనే కాంట్రాక్టు లెక్చరర్లను ఇస్తమని వాళ్ళు. లెక్చరర్లు లేకుండా పిల్లలెట్ల చేర్తరని వీళ్ళు. ఇంచార్జి ప్రిన్సిపాల్లని నిన్న మొన్న వచ్చిన పొరగాండ్లను పెట్టె వాళ్ళమాట ఎవ్వరికి లెక్కలేకుండె. మధ్యన స్కూల్ ఎడ్యుకేషన్ వాళ్ళలోని పంచాయితీలు...."

అంతలోకి ప్రిన్సిపాల్ ఒగిరిచ్చుకుంట వస్తుండడం చూసి అందరు లేచి నిలబడ్డరు. చేతిలున్న బ్యాగు ఓ కుర్చీల బెట్టి కూర్చున్నడు ప్రిన్సిపాల్. అంటెండరు ఉరుక్కుంట పోయి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చిచ్చిండు. గటగటా మంచినీళ్లు తాగి గ్లాసు కింద పెట్టిండు.

అప్పటిదాకా నిశ్శబ్దంగ ఉన్న లెక్చరర్లు "ఏంటి సార్ మీటింగు విశేషాలు" అన్నరు ఏక కంఠంతో.

స్టాఫ్ మీటింగ్ పెట్టి అంతజెప్త నుదుటన పట్టిన చెమట తుడుచుకుంటు అన్నడు ప్రిన్సిపాల్. లంచ్ బెల్ కొట్టించి స్టాఫంత ప్రిన్సిపాల్ రూంలకు వచ్చిండ్రు. ప్రిన్సిపాల్ ఆవేశం, ఆయాసం ఇంకా తగ్గలేదు.

అబ్బబ్బ ఏం కమిషనరండి.. ఏం లెక్కలు... ఆ మధుగారూ మీరు మినిట్స్ నోట్ చెయ్యండి. ఏజిఎంసి గారు ఉన్నరా... అన్నట్టు మొన్న వచ్చిన రోజులు అంటే సిఎల్‌లు, ఓడీలు, బందులు, సెలువులు పోగా వచ్చిన దినాలు, సంవత్సరానికి తీసుకుంటున్న జీతం లెక్కేస్తే ఒకొక్క ఇన్‌స్ట్రక్షనల్ దినానికి ఒక్క ఇంగ్లీష్ కృష్ణారావుకే రు 2,600/- పడుతుంది. ఆయన సబ్జెక్టుల పాస్ పర్సంటేజ్ పన్నెండు శాతం. అంటే ఒక్క ఇంగ్లీషు పాస్ కానీకనే ఒక్కొక్క విద్యార్థి మీద ప్రభుత్వం ముప్పయి వేలు ఖర్చుపెడుతుంది. ఇదంత కమిషనర్ కంప్యూటర్ల ఉందయ్యా"

"ఇంతకు మనం ఏం చెయ్యాలంట సార్" అన్నాడు అశోక్.

"గది కూడా మననే చెప్పమంటుండె. ఎవరెవరు ఏమేం చేస్తరో? ఎట్ల టార్గెట్ రిజల్టు తెస్తరో రాసియ్యమంటుండె"

"రిజల్టే ముఖ్యమయితే మాస్ కాపి చేపిస్తే సరి, అన్నడు అశోక్, గట్ల జేస్తే మల్ల లాభపడేది ప్రయివేటోని కాలేజీలే. ఈసారి ప్రాక్టికల్స్‌లో కూడా జంబ్లింగ్ పెడ్తరంట"

"గిదంత చూస్తుంటె కుక్కను చంపాలంటె పిచ్చికుక్క అనాలన్నట్లుంది. ఆఖరికి కాలేజీలన్ని మూసేసి ప్రైవేటోనికి లీజు కిచ్చుకుంటరేమో" అన్నడు ఇక్బాల్.

'ఆ గిదేదో దూడను చీకమని ఆవును తన్నమని అన్నట్లుంది" అశోక్ అన్నడు.

"ఇదంత మామూలే సార్. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు తమ బాధ్యత నుండి తప్పించుకోవడానికి అనేక మార్గాలు వెతుకుతుంది. అయితే ఈ పరిస్థితికి మనం కూడా కొంతవరకు కారణమని మనం గుర్తించాలి. ఎవరు చేసిన పాపమయితేనేం. జనానికి సర్కారు కాలేజిల మీద విశ్వాసం పోయింది. తిరిగి వారి విశ్వాసాన్ని పొందడానికి మనం ఏం చెయ్యాలో ఆలోచించుకోవాలి. పిల్లల అవసరాలకు అనుగుణంగా బోధనాపద్ధతులు మార్చుకోవాలి. ఎంతసేపూ పిల్లలను చదివించడం గురించేకాదు. ఈ రెండు సంవత్సరాలలో మనం వాళ్ళకు ఏం చెయ్యగలమో ప్రయత్నించాలి" అన్నడు మాథ్స్ లెక్చరర్.

"అవును వ్యవస్థను విమర్శించడం మానేసి మార్చడానికి మనం చెయ్యగలిగింది చేద్దాం" ఫిజిక్స్ లెక్చరర్ అన్నడు.

★

మీ ఇంట్లో..... పెంపుడు జంతువులున్నాయా?

కొంతమంది పెంపుడు జంతువులను చాలా ఇష్టంగా, ప్రేమగా చూసుకుంటుంటారు. అందులో ఎక్కువగా కుక్కలు, పిల్లులు మనం చూస్తాం. వాటిని తమ ఇంట్లోని సభ్యుల్లాగా చూస్తారు. తమ పక్కన కూర్చోబెట్టుకోవడం, భోజనాల గదిలోకి తీసుకుపోవడం, పక్కలో పడుకోబెట్టుకోవడం చేస్తుంటారు. ఇంకా సంతానం లేని వారు కొందరు వాటినే పిల్లలుగా కూడా పెంచుకుంటారు. జంతువులతో ప్రేమగా ఉండడం మంచిదే కానీ వాటి నుంచి వ్యాధులు సోకకుండా చూసుకోవడం మంచిది.

ముఖ్యంగా చిన్న పిల్లలు వాటితోనే ఎక్కువసేపు గడుపుతుంటారు. వాటిని ముద్దు పెట్టుకుంటారు. ఎక్కడికెళ్లినా తమ వెంటే తీసుకెళ్తుంటారు. మూగ జీవాల పట్ల ప్రేమ చూపించడం తప్పకాదు. అయితే వాటికి అతి సన్నిహితంగా ఉండడం వల్ల మనకు కొన్ని రకాల వ్యాధులు వచ్చే అవకాశముంది. అందుకే వాటిని ఎల్లవేళలా శుభ్రంగా ఉంచాలి. అప్పుడు వాటి ఆరోగ్యానికీ మన ఆరోగ్యానికీ ఎటువంటి హానీ ఉండదు.

పెంపుడు జంతువుల నుండి మనకు వ్యాధులు రాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. మరి అవేంటో చూద్దామా...

♦పెంపుడు జంతువులకు డెటాయిల్ వేసిన నీళ్లతో శుభ్రంగా స్నానం చేయించాలి.

♦వాటికి టీకాలు వేయించి డాక్టర్ సలహాతో మధ్యమధ్యలో వైద్యం చేయిస్తూ ఉండాలి.

♦వాటికి ప్రత్యేకమైన స్థలాన్ని కేటాయించి దాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలి.

♦అవి తిని వదిలేసిన ఆహార పదార్థాలను ఇంటికి దూరంగా పడేసి పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి.

♦అవి ఒక సమయానికి మలమూత్ర విసర్జన చేసేట్టు అలవాటు చేయాలి. అందుకోసం ఇంటికి దూరంగా తీసుకెళ్లాలి. పరిసర ప్రాంతాలలోనే ఆ పని కానిచ్చేస్తే వాటిలోని మలిన కణాలు గాలిలో కలిసి మనుషులకు రోగాలు సంక్రమించే ప్రమాదముంది.

♦వాటి లాలాజలం మన శరీరంమీద గానీ, పుండ్లమీద గానీ పడకుండా జాగ్రత్తపడాలి.

♦అంతేకాదు గోళ్లలో మట్టి చేరకుండా చూసుకోవాలి.

♦చిన్న పిల్లలు ఎక్కువగా వాటి మూతితో, నాలుకతో ఆడుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఆ సమయంలో అవి కరవడం కానీ, గీరడం కానీ చేస్తుంటాయి. కాబట్టి చిన్నారులను వాటికి ఎంత దూరంగా ఉంచితే అంత మంచిది.

♦వాటికి ఏమాత్రం వ్యాధి సోకినట్టనిపించినా దూరంగా ఉండడమే మంచిది.

పెంపుడు జంతువులు నలతగా ఉండడం, వాటి నోటి నుంచి లాలాజలం విపరీతంగా కారడం, కళ్లలో నుండి నీరు కారడం, శరీరం నుండి దుర్వాసన రావడం గమనించిన వెంటనే వాటికి తగిన వైద్యం చేయించాలి. అయితే ఇవేమీ లేకపోయినా అప్పుడప్పుడూ వైద్యుని వద్దకు తీసుకెళ్లి చెకప్ చేయిస్తే మంచిది. ఎందుకంటే ఒక్కోసారి ఈ లక్షణాలేమీ లేకపోయినా అవి జబ్బుపడే అవకాశముంది. దాంతో వాటితో సన్నిహితంగా ఉండేవారికి కూడా అవి సంక్రమించే ప్రమాదముంది. పెంపుడు జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు.

జంతువుల నుండి సంక్రమించే వ్యాధులు చాలా ప్రమాదకరమైనవి. అవి ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే ప్రమాదమూ ఉంది. అందుకే అవి వచ్చాక బాధపడడం కంటే రాకముందు జాగ్రత్త పడడమే మంచిది కదా.

పెంపుడు జంతువుల ద్వారా సోకే వ్యాధులు

'రేబిస్' కుక్కల నుంచి సోకే ప్రమాదకరమైన వ్యాధి. ఇది వైరస్ వల్ల వ్యాపిస్తుంది. కుక్కలకు ఇది సోకకుండా చూసుకోవాలి. ఈ వ్యాధి సోకితే రేబిస్ ఇంజక్షను ఇప్పించి వాటికి పూర్తిగా నయమయ్యే వరకూ దూరంగా ఉంచాలి. అది కరిస్తే ఇతర జంతువులకు కూడా ఈ వ్యాధి సోకుతుంది. అందుకే మిగతా జంతువులకు, పిల్లలకు రేబిస్ వచ్చిన కుక్కలను దూరంగా ఉంచాలి. వాటి లాలాజలం తాకినా లేదా అవి కరిచినా, గీరినా మనుషులకు రేబిస్ వచ్చే ప్రమాదముంది.

పెంపుడు జంతువులకు 'అమీబియాసిస్, టాక్సో ప్లాస్మోసిస్, బాలంటి డియోసిస్' వంటి వ్యాధులు వస్తాయి. వాటికి కలుషిత నీరు, ఆహారం ఇవ్వడం వల్ల ఈ వ్యాధులు వస్తాయి. దీనికి కారణం ప్రోటోజోవా అనే వ్యాధి కారక క్రిమి. మనుషులు తీసుకునే ఆహారంలోగానీ, తాగే నీటిలో గానీ ఈ వ్యాధులున్న జంతువులు మూతి పెడితే వారికి కూడా సంక్రమిస్తాయి.

బ్యాక్టీరియా కారణంగా కొన్ని వ్యాధులు సంక్రమిస్తాయి. అవి బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, టిబి, సాల్మొల్లోసిస్, స్ట్రెప్టోకోకల్ సోర్‌త్రోట్. అవి నీటి ద్వారా, ఆహారం ద్వారా, జంతువుల స్రవాల ద్వారా, సూక్ష్మక్రిముల ద్వారా మనుషులకు వ్యాపిస్తాయి.

'బాస్టోమైకోసిస్, రింగ్‌వార్మ్, కాండిడి యాసిస్' వంటి వ్యాధులు ఫంగస్ ద్వారా వ్యాపిస్తాయి. ఇవి కుక్కలతో బాగా సన్నిహితంగా ఉండేవారికి వ్యాపిస్తాయి.

బాహ్య పరాన్న జీవుల ద్వారా 'ఎలర్జీ, స్కేబిస్, వంటి వ్యాధులు, అంతర్ పర్నా జీవుల ద్వారా 'ఎకైనోకోకస్, ఆంకైలో స్టోమియాసిస్' వంటి వ్యాధులు వస్తాయి. పరాన్నజీవుల లార్వాలు, బద్దె పురుగులు, ఏలిక పాముల ద్వారా ఈ వ్యాధులు విపరీతమౌతాయి.

ఇంకో ముఖ్య విషయం. పెంపుడు జంతువులను బయటి వాటితో అసలు తిరగనీయకూడదు. ఎందుకంటే అలా తిరగడం వల్ల పైన చెప్పుకున్న వ్యాధులు త్వరగా వ్యాపిస్తాయి. అంతేకాక వాటికి చేయించిన చికిత్స కూడా వృధా అవుతుంది. ★

నవ్వుల్ - పువ్వుల్

స్పూన్



డాక్టర్ : అన్నం తినేముందు ఈ మందు మూడు స్పూన్లు వేసుకోండి.
రోగి : కానీ మా ఇంట్లో ఒక స్పూనే ఉంది డాక్టర్

కనిపెట్టింది

మాస్టర్ : రామూ! ప్రపంచ పటంలో అమెరికా ఎక్కడుందో చూపించు.
రాము : (చూపిస్తూ) ఇక్కడ సార్.
మాస్టర్ : శ్యామ్! నువ్వు చెప్పు అమెరికాను కనుగొన్నదెవరు?
శ్యామ్ : రాము సార్.

తాహతు

బిచ్చగాడు : పది పైసలు ధర్మం చేయండి బాబూ



బాబూరావ్ : అరె! పది పైసలకేం వస్తుందిరా! ఎక్కువ అడగవెందుకని?
బిచ్చగాడు : అయ్యా! మనిషి తాహతును బట్టి అడుగుతాను బాబయ్యా.

నగల దుకాణం

జైలర్ : ఒరేయ్! జైలు నుండి విడుదలైన తర్వాత ఏంచేస్తావురా?
ఖైదీ : నగల దుకాణం తెరుస్తా సార్.
జైలర్ : నగల దుకాణం పెట్టడానికి నీకంత డబ్బు ఎక్కడిదిరా?
ఖైదీ : నగల దుకాణం తెరవడానికి చిన్న తాళం చెవి చాలు సార్.

ఎమ్.ఎల్.నారాయణ

ఖాళీ టిన్నులు

నౌకరుతో వ్యాపారి : ఒరేయ్! ఈ పది టన్నుల నూనె భూమిలో దాచరా. ఈ రోజు ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్లు వస్తున్నారు.

నౌకరు : (కొంత సేపటికి ఖాళీ టిన్నులతో వచ్చి) సార్ నూనెను భూమిలో దాచాను. ఈ ఖాళీ టిన్నులు ఎక్కడ దాచేది సార్.

నీళ్లపాలు

వ్యక్తి : నువ్వు ఆవుపాలు అమ్ముతావా?
పాల వ్యాపారి : లేదు
వ్యక్తి : ఎద్దుపాలా
పాలవ్యాపారి : లేదు
వ్యక్తి : మేకపాలా
పాలవ్యాపారి : లేదు బాబూజీ
వ్యక్తి : (చిరాకొచ్చి) మరి దేనిపాలు అమ్ముతావు?
పాలవ్యాపారి : నీళ్లపాలు

డార్క్ కలర్

రమేష్ : ఏంటిరా! నువ్వెప్పుడూ డార్క్ కలర్సే వాడతేవేంటి?
సురేష్ : డార్క్ కలర్సా పాడా! ఇది తొడుక్కుని రెండు నెలలయింది.

వంతెన



(ఇద్దరు మిత్రులు మాట్లాడుతున్నారు)
మొదటివాడు : ఒరేయ్! ఇప్పుడే పాతవంతెన మీద నుండి వస్తున్నా. సడెన్‌గా కూలిపోయిందిరా.
రెండోవాడు : ఏంటి పాత వంతెనేనా?
మొదటివాడు : కాదురా! పాత దానిపక్కనున్న కొత్త వంతెన.



ఎన్నున్నాయో...

నేస్తాలూ! పై బొమ్మ చూడండి. కుందేలు భలేగా చలి కాచుకుంటోంది కదూ. మరి చలికాలం కదా. నాలుగు పుల్లలు మండించి వెచ్చగా కూర్చుంటే హాయిగా వుంటుంది. సరే అసలు విషయానికొద్దాం. కుందేలుకు ఇష్టమైన క్యారెట్లు ఇక్కడ చాలా వున్నాయి. అవి మొత్తం ఎన్నున్నాయో గుర్తించి చెప్పండి.

నేనెవరో తెలుసా?

హలో పిల్లలూ... ఇవాళ మీకో చిన్న పరీక్ష. ఏంటంటే ఇక్కడ రకరకాల ప్రాణులున్నాయి చూశారుగా. వీటిలో నుండి ఒక ప్రాణి గురించి కొన్ని క్లూలు ఇస్తాము. వాటి ఆధారంగా ఆ జంతువేదో చెప్పండి.

నన్ను ఆఫ్రికాలో కనుగొన్నారు.

ఒకేసారి నలుగురు పిల్లల్ని కంటాను.

ఇంకా నన్ను క్షీరదం అని కూడా అంటారు.

ఇప్పుడు చెప్పండి నేనెవరినో.



పిల్లలెందరు?

హాయ్ నేస్తాలూ... ఇక్కడ ఎంత మంది అబ్బాయిలు కనిపిస్తున్నారు. ఎంతమంది ఏంటి? ముగ్గురు చక్కగా కనిపిస్తున్నారుగా. ఇంక చెప్పేదేముంది అనుకుంటున్నారా.. కొంతవరకు మీరు అనుకున్నది కరెక్టే కానీ ఈ బొమ్మలో ఏడుగురు అబ్బాయిలున్నారు. ఎలాగో ఆలోచించండి. తెలీకపోతే జవాబు చూడండి.

ఏం కనిపించాయి...



హాయ్ నేస్తాలూ... పక్కన మూడు బొమ్మలున్నాయి కదా. ఈ మూడు బొమ్మలకు ఒక లింక్ వుంది. అదేంటో చెప్పాలి. అదే కాక ఏ బొమ్మలో ఏం కనిపించిందో చెప్పాలి.

బాలనేస్తాలు

ఏది పెద్దది

పిడుగులూ!... కింద రెండు గీతలున్నాయి కదా. వాటిలో ఏది పెద్దదో చెప్పకోండి. తెలీకపోతే మా సమాధానం చూడండి.





చుక్కలు కలిపేద్దామా...





రంగులేయాలోచ్

ఫ్రెండ్స్... h అనే అక్షరం వున్న దగ్గర నారింజ రంగు, f అనే అక్షరం వున్న దగ్గర చాక్లెట్ రంగు వేసి చూడండి. అదిరిపోయే బొమ్మలు మీ ముందుంటాయి.

చిత్ర విచిత్రం

హాయ్ ఫ్రెండ్స్... ఈ ఫొటో భలేగా వుంది కదూ. ఏదో ధూపం గాల్లో తేలుతున్నట్లు కనిపిస్తుంది. కానీ ఇందులో ఇద్దరున్నారు. వారెవరో మరి.



జవాబులు

పిల్లలెందరు?... : అబ్బాయిలు నడుంకి తాడు కట్టి వుంది కదా. అక్కడ నుండి అబ్బాయి తల నుండి నిలువుగా చూస్తే ఒక బాబు తలకిందులుగా కనిపిస్తాడు. అలాగే అడ్డంగా కూడా చూడండి అదే అబ్బాయి వెల్లకిలా పడుకున్నట్లుగా కనిపిస్తుంది. అలాగే ముగ్గురిని రెండు వైపుల నుండి చూడండి. ఏడుగురు అబ్బాయిలు కనిపిస్తారు.

ఎన్నున్నాయో.... : 11 క్యారెట్లు.

ఏం కనిపించాయి... ఎద్దు, తాత పక్క పక్కనే వున్నారు. ఆ రెండు బొమ్మలను కలిపితే మరో తాత మొహం కనిపిస్తోంది.

నేనెవరో తెలుసా? ... కంగారూ

ఏది పెద్దది? ... రెండు సమానం. కావాలంటే కొలిచి చూడండి.

చిత్ర 'విచిత్రం'.. : తల్లీ, బిడ్డా. తల్లి బిడ్డను పైకెగరేసి ఆడిస్తోంది.

వింతల లోకంలో తెలుగిన్నిస్

'నీకష్టం చూడలేకపోతున్నా గానీ...ఓ పది రూపాయలిస్తే నీ పేరు గిన్నీస్ బుక్‌లో చోటు చేసుకునే మార్గం చెబుతా' ఏదో ఒకటి చేసి ప్రపంచ రికార్డుల నమోదు పుస్తకం గిన్నీస్ బుక్‌లో తన పేరు నమోదు చేసుకోవడానికి తంటాలు పడుతున్న తన స్నేహితుడితో అన్నాడు ఒకాయన. ఏదో ఒకటి చేసి తన పేరిట ఒక రికార్డును నమోదు చేసుకోవాలనే లక్ష్యంతో రకరకాలుగా ప్రయత్నిస్తున్న ఆ స్నేహితుడు ఈ మాట వింటూనే రికార్డు సృష్టించినంత ఆత్రంగా 'పదేం ఖర్మరా...వంద రూపాయలిస్తా...బాబ్బాబూ వెంటనే చెప్పేయ్...' అంటూ బతిమలాడాడు.

అందుకా స్నేహితుడు గురజాడ వారి గిరీశంలా ఫోజు పెడుతూ 'నువ్విచ్చే పది రూపాయల్తో ఒక పెన్ను కొనుక్కుని నీ పేరును నువ్వే...ఒక్కసారేం ఖర్మ పది సార్లైనా రాసుకో...' అని చెప్పిన జవాబుకు రికార్డు ఆశావహుడి దిమ్మతిరిగింది.

'ఏదో ఒక పని చేసి ఘనత సృష్టించటం ద్వారా తన పేరును గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేయించుకోవడం కోసం పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నించే వారినుద్దేశించి చెప్పకునే ఈ హాస్యోక్తి చిన్నప్పటి నుంచీ వింటున్నదే.

అయితే నిన్నమొన్నటి దాకా చాలామందికి ఒక స్వప్నంగా ఉన్న ఈ 'రికార్డు సృష్టి'ని నేడు చాలామంది సాకారం చేసుకుంటున్నారు. అన్ని రంగాల్లో ఉన్నట్లే ఈ 'రికార్డు'ల పుస్తకంలోనూ మన తెలుగు వారు చాలామందే స్థానం పొందగలిగారు. ఎన్నో వింతలు, విశేషాలు అనిపించే ఘనకార్యాలను చేస్తూ గిన్నిస్ రికార్డులను సాధిస్తున్న వారు ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో మరీ ఎక్కువయ్యారు. సగటున చూస్తే నెలకోసారైనా గిన్నిస్ ఫీట్లను చేస్తున్నారు. ఇలా రికార్డులతో చోటు సంపాదించుకుంటున్న తెలుగు వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ప్రపంచ రికార్డుల పుస్తకంలో చోటు పొందేందుకు రకరకాల సాహసాలు చేసే వారే కాదు... ఏమాత్రం కష్టపడకుండా ఈజీగా రికార్డులు సృష్టించే ఆలోచనలు చేసే వారూ మన కళ్లెదుటే ఉన్నారు. మన రాష్ట్రీయులు చేస్తున్న ఈ రికార్డులను తెలియపరిచేందుకే 'తెలుగిన్నిస్'...ను మీకందిస్తున్నాం.

- ఎన్. మదనయ్య

జిందగీ భర్ భీ...జిందగీ బాద్ భీ...

బతికినంత కాలమే కాదు...అనంతర కాలంలోనూ గొప్పగా ఉండాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. జీవిత కాలంలోనే కాదు అటు తరవాతి కాలంలోనూ ఇలాంటి సువర్ణావకాశాన్ని కల్పించేదే ప్రపంచ రికార్డుల పుస్తకం 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'.

అందుకే దానిలో తమ పేరును నమోదు చేసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. రకరకాలుగా కృషి చేస్తుంటారు. పసిఫిక్ సముద్రం లోతు అంతు చూడడం దగ్గర నుంచీ విమానాల నుంచి కిందకు దూకిన వారి దాకా...అతి శీతల ప్రదేశమైన అంటార్కిటికాలో గడపడం నుంచీ వేడి వేడి నిప్పులను నమిలి మింగడం దాకా... ఎన్నో ఘన కార్యాలు, ఇంకెన్నో సాహసాలు, మరెన్నో అద్భుతాలు చేసి ఈ పుస్తకంలో చోటు దక్కించుకోగలిగిన వారు ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేల మంది ఉన్నారు. వీరిలో మన తెలుగు వారు వందల సంఖ్యలో ఉన్నారు. వీరు చేసిన అరుదైన వింతలు, విశేషాలతో కూడిన ఆయా సరదా, సాహస సంగతులను మీతో పంచుకోవాలనే ఉత్సాహం ఉంది. అయితే స్థలాభావం, సమయాభావం దృష్ట్యా అది పెద్ద సాహసమే అవుతుంది. అందుకని ప్రధానమైన కొన్నిటి గురించి ప్రస్తావిస్తాను.

'ఫిట్‌నెస్‌పై చైతన్యం కలిగించడమే తన లక్ష్యం'గా చెప్పుకునే ది ఫిగర్ ఆఫ్ ఫిట్‌నెస్ దినాజ్ అలియాస్ దినాజ్ వెర్వత్‌వాలా 26 గంటల పాటు చేసిన ఏరోబిక్స్ మారథాన్ రాష్ట్రంలో జరిగిన తాజా గిన్నిస్ ఫీట్. సికింద్రాబాద్‌లోని పోలోగ్రౌండ్స్‌లో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 8.30 గంటలకు విజయవంతంగా ముగించిన తన ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌లతో ప్రపంచ రికార్డును సృష్టించారు. బాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్, క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్‌తో పాటు దాదాపు 700 మంది ప్రముఖులైన ఆమె అభిమానులు, శిష్యుల సహాయంతో ఆమె నిర్వహించిన ఈ అరుదైన కృత్యానికి రికార్డుకు మించిన అభినందనలు కూడా అందుకున్నారామె.

రాష్ట్రంలో గిన్నిస్ రికార్డు ఫీట్‌ను చేసిన తాజా వ్యక్తి దినాజ్ కాగా అంతకుముందు డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో ప్రదర్శించిన అత్యంత పెద్దదైన ఎయిడ్స్ రిబ్బన్‌ను తయారు చేయడం ద్వారా పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు పాత రికార్డును బ్రేక్ చేసి

నూతన రికార్డును సృష్టించారు. భయంకరమైన ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేటందుకే 110 మీటర్ల పొడవు, 49 మీటర్ల ఎత్తు గల ఈ రిబ్బన్‌ను రూపొందించానని ప్రకటించారు సూర్యారావు. ఈ సామాజిక కార్యక్రమం ద్వారా విశాఖపట్నం పేరు ప్రపంచ రికార్డుల పుస్తక పుటలకెక్కింది.

గాంధీ మహాత్ముడు ప్రారంభించిన సత్యాగ్రహ స్ఫూర్తికి వ్యాప్తి కలిగించే ఉద్దేశంతో 2008 జూన్ 2,3 తేదీల్లో విజయవాడలో ఒక విశిష్టమైన సంగీత కార్యక్రమం జరిగింది. గజల్ శ్రీనివాస్‌గా పేరు గాంచిన గాయకుడు కేశిరాజు శ్రీనివాస్ 76 దేశ విదేశీ భాషల్లో పాటలు పాడి సరికొత్త రికార్డు సృష్టించారు.

నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన 35 సంవత్సరాల యువకుడు 2007లో రెండు గంటలా 20 నిమిషాల్లో 13 పాత్రల ధారణ ద్వారా గిన్నిస్ రికార్డు కృత్యాన్ని నిర్వహించాడు. భారతీయ పురాణాలు, ఇతిహాసాల్లోని నారదుడు, శివుడు, శబరి, కర్ణుడు, దుర్యోధనుడు, రావణాసురుడు, ఘటోత్కచుడు, శకుని, శివాజీ వంటి పాత్రలతో పాటు క్రీస్తు, శాంటా క్లాజ్, అలెగ్జాండర్ వంటి 13 పాత్రలను ఏకధాటిగా ఒకదానివెంట ఒకటిగా ధరించి ఏకపాత్రాభినయం చేసి ప్రదర్శకులచే 'ఔరా...!!!' అనిపించి ఈ రికార్డును సృష్టించాడు.

పెద్దలే కాదు ఎనిమిదేళ్ల బాలుడు సైతం గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్న అరుదైన ఘనత మన రాష్ట్రానికే దక్కింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూరుకు చెందిన వి. రాఘవ శ్రీవాస్తవ అనే మూడవ తరగతి చదువుతున్న చిన్నారి పదాల స్పెల్లింగును రివర్స్‌లో చెప్పి గిన్నిస్ బుక్‌లో తన పేరిట రికార్డును నమోదు చేయించుకున్నాడు. 2009 జనవరి నెలలో 2 నిమిషాల 40 సెకండ్ల సమయంలో ఆరు, ఏడు, ఎనిమిది అక్షరాలతో కూడిన 50 పదాల స్పెల్లింగును రివర్స్ పద్ధతిలో అప్పజెప్పాడు.

ఒకే ఒక్కసారి కంప్యూటర్ స్క్రీన్‌పై చూసి మరు నిమిషంలో 132 అంకెల సంఖ్యను అప్పజెప్పడం ద్వారా అద్భుతమైన ప్రతిభను చూపిన 13 సంవత్సరాల కుర్రాడు నిశ్చల్ నారాయణన్ గిన్నిస్‌లో తిష్ట వేసుక్కూచున్నాడు. ఈ అరుదైన మేధోప్రక్రియను చేయడం ద్వారా 'ఒక నిమిషంలో అత్యంత పెద్ద అంకెలు గల సంఖ్యాశ్రేణిని గుర్తుంచుకుని అప్పజెప్పిన' ఘనతను సొంతం చేసుకున్నాడు.

విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు మన రాష్ట్రానికి చెందిన పుస్తకాలు రాసే వారూ గిన్నిస్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించుకున్నారు. తాను రాసిన పుస్తకానికి అతిపెద్ద టైటిల్‌ను పెట్టడం ద్వారా గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రొఫెసర్ శ్రీనాథాచారి.

రెండు రికార్డులు

విశాఖపట్నానికే చెందిన మినియేచర్ కళాకారుడు మల్ల శివ రెండు గిన్నిస్ రికార్డులను సాధించారు. పిల్లలు రాసుకునే పలకతో అతి చిన్న చెస్ బోర్డు, చెస్ పాన్స్‌ను తయారు చేయడం ద్వారా ఒకసారి, అతి చిన్న గ్లోబును తయారు చేయడంతో మారోసారి రికార్డును సృష్టించారు. 26x26 మిల్లీమీటర్ల చెస్ బోర్డు, 1 నుంచి 11 మిల్లీమీటర్ల సైజులో చెస్ కాయిన్స్‌ను రూపొందించిన ఈయన 10 మిల్లీ మీటర్ల రేడియస్, 20 మిల్లీమీటర్ల డయామీటర్‌తో గ్లోబును తయారు చేశారు. 2008 జనవరి 13వ తేదీన చెస్ బోర్డును, మార్చి 3వ తేదీన గ్లోబును తొలిసారిగా ప్రదర్శించారు. చేతితో తయారు చేసిన అతి చిన్న వస్తువులుగా అవి గిన్నిస్ పుస్తకాన్ని అలంకరించాయి.



భక్తులతో ఆపదమొక్కుల వాడిగా పిలిపించుకునే శ్రీవేంకటేశ్వర స్వామి కూడా రెండు గిన్నిస్ రికార్డులను సాధించుకున్నాడు. అన్నమయ్య (తాళ్లపాక అన్నమాచార్య) 601వ జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అన్నమయ్య లక్ష గళార్చన' అరుదైన కళారూపకంగా గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఒకే సారి లక్ష మంది అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. 2009 మే 10వ తేదీన నిర్వహించిన ఈ కార్యక్రమం తెలుగు వారి గళానికి శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టింది. అమెరికాలోని సిలికానాంధ్ర సాంస్కృతిక శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా నిర్వహించిన ఈ గళార్చనలో పాల్గొన్న లక్ష మందిలో ప్రతి ఒక్కరికీ గిన్నిస్ రికార్డు సర్టిఫికేట్ లభించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

దీనితో పాటు తాను పొందే తలనీలాల ద్వారా గిన్నిస్ ఘనతను సొంతం చేసుకున్నారు స్వామి. ఈ ఆలయంలో రోజుకు సగటున వచ్చే 30,000 మంది భక్తుల తలనీలాలను తీసేందుకుగానూ 600 మంది క్షురకులు 24 గంటలు పనిచేస్తూనే ఉంటారు. ఇలా సేకరించిన జుత్తు ద్వారా దేవాలయానికి ఏడాదికి 2.2. మిలియన్ డాలర్లకు మించిన ఆదాయం రావడాన్ని గిన్నిస్ ప్రచురణా కర్తలు ప్రపంచ రికార్డుగా నమోదు చేసుకున్నారు.

వ్యక్తులే కాదు మన సంస్కృతి కూడా ఇందులో చోటు సంపాదించింది. అమెరికాలోని సిలికానాంధ్ర సాంస్కృతిక శాఖ 2008 జూన్ 21న కాలిఫోర్నియాలోని క్యుపర్టినో నగరంలో ఒక ప్రత్యేకమైన నాట్య ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఇందులో 328 మంది నాట్యకారులు పాల్గొని కూచిపూడిలోనే ప్రత్యేకమైనదిగా పేరు పొందిన జతిస్వర నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఇంతమంది ఒకేసారి నృత్యంలో పాల్గొనడమే కాదు, వీరిలో [illegible] వర్గాలకు చెందిన వారుండడం మరో విశిష్టత. దీనితో అత్యంత అరుదైన నృత్య కార్యక్రమంగా ఇది గిన్నిస్ రికార్డును సృష్టించింది.

ట్రిపుల్ రికార్డ్ హోల్డర్

బహుముఖ ప్రజ్ఞావంతుడు స్క్వాడ్రన్ లీడర్ జయసింహ మూడు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుని, ఇలాంటి అరుదైన ఘనతను సాధించిన తొలి తెలుగు వ్యక్తిగానూ, ఏకైక భారతీయుడుగానూ మరో అరుదైన రికార్డును సృష్టించారు. ఒక్కసారి విన్న వెంటనే గుర్తుంచుకుని 200 వస్తువుల పేర్లను తిరిగి అప్పచెప్పడం ద్వారా ఒకసారి, బ్లైండ్ ఫోల్డ్ ద్వారా 20 మంది పేర్లు, వారి పుట్టిన తేదీలను అప్పజెప్పడం ద్వారా రెండోసారి, 120 గంటల పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ లెక్చర్లు ఇవ్వడం ద్వారా మూడోసారి ఈ రికార్డును సృష్టించి తెలుగు వారి ఘనకీర్తిని ప్రపంచ వీధుల్లో ప్రదర్శించారు జయసింహ. అంతే కాదు తన రికార్డును తన శిష్యుడు నిశ్చల్ నారాయణన్‌తో బ్రేక్ చేయించుకున్న ఘనతను కూడా ఈయన సొంతం చేసుకున్నారు.

సినిమా ఘనతలు

వివిధ రంగాల్లో మన గిన్నిస్ వింతలిలా ఉండగా సినిమాల ద్వారానూ మన వారు సరికొత్త రికార్డులను సృష్టించారు. తన హాస్య నటనతో ఆబాలగోపాలాన్ని నవ్విస్తున్న బ్రహ్మానందం అత్యధిక తెలుగు సినిమాల్లో చేసిన నటుడుగా రికార్డును సొంతం చేసుకున్నాడు. 20 సంవత్సరాల తన సినీ జీవితంలో ఆయన దాదాపు 754కు పైగా సినిమాల్లో నటించారు. వెంటవెంటనే తన బాడీ మూవ్‌మెంట్స్‌ను, హావభావాలను మార్చగల దిట్టగా పేరుపొందిన ఈయన తనదంటూ ప్రత్యేక డైలాగ్ డెలివరీని కూడా కనబర్చగలడని పేర్కొంటూ గిన్నిస్ పుస్తకంలో ఈయనకు రికార్డును అందజేసింది. హావభావాలతో బ్రహ్మీ రికార్డును సాధిస్తే అత్యధిక భాషల్లో సినిమాలు తీసిన నిర్మాతగా డి. రామానాయుడు గిన్నిస్ బుక్‌లో తన పేరును నమోదు చేసుకున్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం వంటి దక్షిణ భారతీయ భాషల్లోనే కాకుండా హిందీ, మరాఠీ, బెంగాలీ, ఒరియా, అస్సామీలతో పాటు విదేశీ భాష అయిన ఇంగ్లీషులోనూ సినిమాలు తీశారు. ఇలా బహుభాషా చిత్రాలు నిర్మించిన వ్యక్తిగా తన పేరిట అరుదైన ఈ గిన్నిస్ ఘనతను సొంతం చేసుకున్నారీ మూవీ మొఘల్. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను పొందిన సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గిన్నిస్ రికార్డుల కెక్కారంటే పెద్దగా ఆశ్చర్యం ఏమీ కలగదు. 2006 జనవరి 7వ తేదీన తన 36,000వ సినీ పాటను పాడడం ద్వారా ఈ పుస్తకంలోని కళా విభాగంలో చోటు సంపాదించుకున్నారు. తన 39 సంవత్సరాల సినీ జీవితంలో అత్యధిక భాషల్లో ఎక్కువ పాటలు పాడిన వ్యక్తిగా ఆయన పేరును ఈ రికార్డు శాశ్వతం చేసింది. పాటలు పాడి ఒకరు, నటనతో ఇంకొకరు, నిర్మాణంతో మరొకరు మన సినీ ప్రముఖులు ఈ ప్రపంచ రికార్డును సొంతం చేసుకోగా విజయ నిర్మల పలు సినీ విభాగాల్లో తన ప్రజ్ఞను నిరూపించుకోవడం ద్వారా ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. 250 సినిమాల్లో నటించి, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 42 సినిమాలకు దర్శకత్వం వహించిన విజయనిర్మల అత్యధిక సినిమాలకు దర్శకత్వం వహించిన తొలి మహిళగా రికార్డులకెక్కారు. సినీ దర్శకత్వ విభాగంలో తనదైన ప్రత్యేక ముద్రను వేసిన దాసరి నారాయణ రావు తన విలక్షణ ప్రతిభ ద్వారా 'దర్శక రత్న' అనే గౌరవాన్ని పొందారు. 150 సినిమాలకు పైగా దర్శకత్వం వహించారాయన. అయితే తన 20 సినీ జీవితంలో 100 సినిమాలకు దర్శకత్వం వహించి అతి తక్కువ కాలంలో ఎక్కువ సినిమాలకు దర్శకత్వం నెరపిన వ్యక్తిగా గిన్నిస్ రికార్డుల పుస్తకంలోకెక్కారు. సినిమా ప్రముఖులతో పాటు ఈ రంగంలోనే ప్రత్యేకమైనదిగా గుర్తింపు పొందిన రామోజీ ఫిల్మ్ సిటీ కూడా గిన్నిస్ పుస్తక పేజీల్లో సుస్థిర స్థానాన్ని పొందగలిగింది. సినిమాలకు సంబంధించి అన్ని రకాల సౌకర్యాలు గల అతి పెద్ద స్టూడియోగానూ ఆర్‌ఎఫ్‌సి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు పొందింది.

గిన్నిస్‌బుక్‌లో... లక్షగళార్చన

ఇలా...ఎందరెందరో ఘనత వహించిన మన తెలుగు వారు గిన్నిస్ రికార్డు పుస్తకం ద్వారా మరింత గణుతికెక్కారు. వారందరికీ...వందనాలు! అభివందనాలు!!

★

గిన్నిస్ రికార్డు సాధించాలంటే....

తెలుగు వారు ఇంగ్లీషు పుస్తకాలు రాయడం గొప్ప విషయమే. రాయడమే కాదు అలా తాను రాసిన పుస్తకానికి ఏకంగా పేజీ పొడవు పేరు పెట్టడం ద్వారా గిన్నిస్ ఘనతను సాధించారు ప్రొఫెసర్, డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి. ప్రజాశక్తి పాఠకులకు ఇంగ్లీషు మాస్టారిగా సుపరిచితులైన ఈయన గత అక్టోబర్ నెలలో తన ఘనతను ఆవిష్కరించారు. దీనితో ఆయన గిన్నిస్ రికార్డును సాధించిన తొలి యూనివర్సిటీ ప్రొఫెసర్‌గానూ, మహబూబ్‌నగర్ జిల్లా వాసిగానూ మరో రెండు విశేషాలు సొంతం చేసుకోగలిగారు. ఈ రికార్డు సృష్టికి ఆయన సాగిన విధానం తెలుసుకుంటే గిన్నిస్ క్రమం అర్థమవుతుంది. ఆ వివరాలు ఇంటర్వ్యూ రూపంలో...

ఈ రికార్డు చేయడానికి అర్హతలేమైనా ఉండాలా?

ఏమీ అవసరం లేదు. ఎవరైనా చేయవచ్చు. కాకపోతే చేసే కృత్యానికే కొన్ని లక్షణాలుండాలి. కొలవడానికి, పోల్చడానికి, తదుపరి అధిగమించడానికి అది అనుకూలంగా ఉండాలి. పైపెచ్చు అది ప్రాణహానిని కలిగించనిదై ఉండాలి. ఈ లక్షణాలతో కూడిన 'పని' చేసి అంతకు ముందు ఉన్న దానిని అధిగమించడం ద్వారా గానీ, కొత్తగా చేయడం ద్వారాగానీ గిన్నిస్ పుస్తకంలో పేరు నమోదు చేయించుకోవచ్చు.



మనం చేసేటప్పుడు గిన్నిస్ తరఫున ఎవరైనా ప్రతినిధి వస్తారా?

ఒకరు చేయాలనుకున్న 'కృత్యం' గురించి ముందుగా వారికి పోస్టు ద్వారా గానీ, ఇ-మెయిల్ ద్వారా గానీ తెలియపరిస్తే ప్రచురణ కర్తల నుంచి మీకు 6 నుంచి 8 వారాల్లో వివరం అందుతుంది. దానిని బట్టి మీరు అనుకున్నది చేయవచ్చు.

దీనికి ఏమైనా డబ్బు చెల్లించాల్సి ఉంటుందా?

మనం గిన్నిస్ ఫీట్ చేసేటప్పుడు ఆ పుస్తకం వారు సాక్షిగా ఉంటూ అప్పటికప్పుడే రికార్డును అందజేయాలని కోరుకుంటే డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. భారతీయ కరెన్సీలో 2,00,000కుపైగానే చెల్లించాలి. ఇలా కాకుండా ఎవరికి వారే ఈ ఘనతను పదిమందికీ ప్రదర్శించడం ద్వారానూ ఎలాంటి ఖర్చూ లేకుండా తమ పేరు నమోదు చేయించుకోవచ్చు.

మనం చేసిన దాని గురించి వారికెలా తెలుస్తుంది?

స్థానికంగా ఉండే పెద్ద వారు, సామాజిక హోదా, చట్టబద్ధమైన పోస్టుల్లో ఉండే వారి సమక్షంలో చేసి వారి నుంచి సర్టిఫికెట్లు తీసుకుని పంపించాలి. దీనితో పాటు చేసిన ఫీట్ గురించి తెలిపే వీడియో, ఫోటోలు జతచేయాలి. ఇంకా ఉంటే పేపర్‌లో వచ్చిన వార్తల కటింగ్‌లు, టీవీ క్లిప్పింగ్‌లు కూడా పంపించాలి. దానిని పరిశీలించిన అనంతరం వారు మీకు సర్టిఫికెట్‌ను అందజేస్తారు.

ఈ మొత్తం ప్రక్రియకు ఎంత కాలం పట్టవచ్చు?

ప్రతి ఏటా ఈ రికార్డు కోసం దాదాపు 65,000 మంది పోటీ పడతారని అంచనా. వారు మాత్రం 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' బేసిస్‌లో జవాబులు చెబుతారు. ముందుగా వారికి రాసి అనుమతి పొందడానికి 6 నుంచి 8 వారాలు, చేశాక సర్టిఫికెట్ పొందడానికి కూడా అంతే సమయం పట్టవచ్చు.

పెద్దల సమక్షంలో

బ్యాగు మాయం!

ముఖ్యమంత్రి అంటే కొణిజేటి రోశయ్య, మన గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, మధ్యప్రదేశ్ గవర్నర్ రామేశ్వర్ ఠాకూర్ పాల్గొన్న సభ, అందునా తిరుపతి. అక్కడ జరిగేదంతా కలియుగదైవంగా భావించే వెంకటేశ్వరుడు చూస్తూనే ఉంటాడని చెప్పుకుంటారు. అలాంటపుడు ఎవరైనా భద్రత గురించి బెంగెట్టుకోవాల్సిన పనేముంటుంది. కార్యకర్తల ముసుగులో చిల్లర దొంగలు చేరి చోరీ చేయటానికి అదేమీ కాంగ్రెస్, తెలుగుదేశం, పిఆర్‌పి సభకాదు. ఆ సభలో మన భారతరత్న లతా మంగేష్కర్‌కు సన్మానంతో పాటు అవమానం జరిగింది. అందరు పెద్దలున్న సభలో తన చేతి బ్యాగ్ మాయమైందని ఆమె గొల్లుమన్నారు. ఘరానా చోరీ ! ఎంత సిగ్గుచేటు !!

దానిలో కొంత సొమ్ముతో పాటు హైదరాబాద్ వెళ్లాల్సిన విమానం టికెట్, మందులున్నాయట, చేసేదేముంది ! ఆమె కూడా గోవిందా అని ఒకటికి రెండుసార్లు అనుకొని ఉంటారు. బ్యాగు పోయినదానికంటే మరుసటి రోజు ఆమెను సాగనంపటంలో చూపిన నిర్లక్ష్యం ఆ పెద్దామెను కష్టపెట్టింది. విమానాశ్రయానికి బయలు దేరేందుకు ఉదయం పదిన్నరకు వసతి గృహం నుంచి బయటకు వచ్చి కారులో కూర్చున్నారు. ఆమెకు ప్రత్యామ్నాయ టికెట్ ఏర్పాటు చేస్తానన్న టిటిడి అధికారి ఎంతకూ రాడే. కారులోనే దాదాపు మూడు గంటలు వేచి చూశారు. మధ్యలో వసతి గృహం సిబ్బంది వచ్చి అమ్మా లోపలికి వచ్చి కాసేపు విశ్రాంతి తీసుకోండి, భోజనం చేయండని అడిగినా అప్పటికే మండిపోతున్న లతమ్మ అంగీకరించలేదు. ఎవరికి ఎన్ని ఫోన్లు చేసినా పట్టించుకున్న దిక్కులేదు. చివరకు 1.30 సమయంలో సదరు అధికారి తీరిగ్గావచ్చి ఆమెకు టికెట్ ఇచ్చాడట. లతమ్మ బ్యాగ్ కొట్టేసిన వాడు ఎంతో ఆశపడి తీరా చివరకు తీవ్ర నిరాశకు గురై ఉంటాడు. ఎందుకంటే పెద్దల బ్యాగుల్లో అంతే స్థాయిలో డబ్బు ఉంటుందని భావించి ఉంటాడు. నిజానికి ఆ స్థాయిలో ఉన్నవారు లావాదేవీలన్నీ క్రెడిట్, డెబిట్ కార్డులతోనే నడిపించేస్తారు. లేదా వారి సహాయకులు ఆపని చేస్తారు.

ప్రముఖులందరూ దొంగలను నిరాశపరుస్తారనుకోనవసరం లేదు. ప్రముఖులు దొంగతనాలు చేయరని అసలే అనుకోకూడదు, దోచుకొనే దొంగలందరూ రోజు గడవని వారు కూడా కాదు. ప్రపంచంలోని ఐదువందల బడా కంపెనీలలో మనందరికీ తెలిసిన జాన్సన్ అండ్ జాన్సన్ ఒకటి. లక్షా 18వేల మంది ఉద్యోగులు పనిచేసే ఆ కంపెనీ ఆస్తుల విలువ 8,500 కోట్ల డాలర్లు. అంతసంపదకు వారసురాలైన కాసే జాన్సన్ ఒక చిల్లర దొంగతనంలో అరెస్టయిందంటే నమ్మగలరా !! జాస్మిన్ లెనార్డ్ అనే ఒక మోడల్ ఇంట్లో లేని సమయంలో ప్రవేశించి అందిన మేరకు నగలు, చెప్పులు, చివరకు లోదుస్తులు కూడా ఎత్తుకు పోయిందని జాస్మిన్ వాపోయింది. కాసే జాన్సన్ తండ్రి ఊడీ జాన్సన్‌కు జట్ విమానాల కంపెనీ కూడా ఉంది. అయినా మాదకద్రవ్యాలు, మందుకు అలవాటు పడి దొంగతనం చేసి గతనెలలో జైలు పాలైంది.

ఇంటర్నెట్‌తో ప్రముఖులకు మా చెడ్డ ఇబ్బంది వచ్చింది. గతంలో మాదిరి దొంగలు పగటి వేళల్లో మారు వేషాల్లో వచ్చి అలాంటి వారి ఇళ్ల అనుపానులు తెలుసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వారి ఇళ్ల గురించి, వారి కార్యక్రమాలు, ఇతర వివరాలన్నీ ఇంటర్నెట్ ద్వారా సంపూర్తిగా తెలుసుకోవచ్చు. ఇటీవల హాలీఉడ్ ప్రముఖుల ఇళ్లు ఈ విధంగానే దోపిడీకి గురయ్యాయి. వారి మాదిరి తాము కూడా విలాసవంతమైన జీవితం గడపాలని, వేష, భాషల్లో వారిని అనుకరించాలని తపనపడిన యువతీ యువకులు దోపిడీకి పాల్పడ్డారు. వారందరూ ఒకే స్కూల్లో, తరగతిలో చదివారట. తమ అభిరుచులకు అనుగుణంగా పారిస్ హిల్టన్, ఆర్లాండో బ్లూమ్, రాచెల్ బిల్సన్, లిండ్సే లోహన్, మెగాన్ ఫాక్స్ వంటి ప్రముఖ సినీతారల ఇళ్లను దోచుకున్నారు. ఆభరణాలు, దుస్తుల వంటి వాటి విలువ 30లక్షల డాలర్లని పోలీసులు ప్రకటించారు. దోపిడీ చేసిన వారు కూడా చిన్నా చితకా నటీనటులు, ధనవంతుల బిడ్డలు కావటం విశేషం. మా కక్షిదారులు డబ్బులేనివారు కాదు అందువలన వారు చేసినదానిని దొంగతనం కింద పరిగణించరాదని, కేవలం ఫ్యాషన్లను అనుకరించాలని నగలు, దుస్తులు తీసుకువచ్చారు తప్ప నేర స్వభావంతో కాదని వారి లాయర్ తెగ వాదిస్తున్నాడు.

హాలీవుడ్‌నే దొంగలు దోపిడీదార్లకు స్ఫూర్తి మేంకూడా తక్కువేమీ తినలేదంటున్నారు ఆంగ్లేయులు. బ్రిటీష్ చిత్ర దర్శకుడు క్వెంటిన్ టారిన్‌తో తీసిన రెండు సినిమాలు 'రిజర్వాయర్ డాగ్స్, పల్ప్ ఫిక్షన్' దొంగలకు ఎంతో ఉత్తేజానిస్తున్నాయట. చిత్రహింసలు, అవమానించటంలో మెళుకువలను ఎన్నో నేర్చుకోవచ్చుట. ఆ సినిమాల్లో మాదిరి దుండగులు దాడులు చేసి ప్రముఖులను దోచుకోవటంతో అలాంటి దొంగలకు మన స్టూవర్ట్‌పురం, సీతానగరం, కప్పరాలతిప్ప దొంగల ముఠాల మాదిరి టారిన్‌టో ముఠాలని అక్కడి పోలీసులు పేరు పెట్టారట.

ఇంటర్నెట్‌తో ప్రముఖులు ఇలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటుంటే అమెరికాలోని ప్రవాస భారతీయులకు మరో కొత్త చిక్కువచ్చి పడింది. ఈ మధ్య అనేక మంది తమ ఇళ్ల ముందు పేర్లతో పాటు తాము కొలిచే వినాయకుడు, ఇతర దేవుళ్లు, దేవతల బొమ్మలను కూడా పెట్టుకొంటున్నారు. దొంగలకు ఇది వరంగా మారింది. అసలే భారతీయులంటే కనీసం కోడిగుడ్డంత బంగారమైనా కలిగి ఉంటారని ప్రతీతీ కదా, అసలే ప్రవాస భారతీయులు కష్టపడి ఇంకా ఎక్కువే బంగారం, ఆభరణాలు కూడబెట్టుకొని ఉంటారు కనుక ఆ ఇళ్ల చోరీ లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నారు. వర్జీనియా రాష్ట్రంలో ఫెయిర్ ఫాక్స్ కౌంటీలో గతేడాది తొలి తొమ్మిది నెలల్లో నమోదైన 21 చోరీల్లో 16 ఇలాంటి ప్రవాస భారతీయులవేనట.

సీరియల్

జరిగినకథ :

హావ్ జీవితంలో జరిగిన ఒక సంఘటన ఆమెను బాగా కలవరపరుస్తుంది. ఆ సమయంలో ఆమెకు మామ అండగా వుంటాడు. ఓదార్చుతాడు. పాపను చూసి ధైర్యం తెచ్చుకోమంటాడు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా బిడ్డను చూచి ఆగిపోతుంది. తర్వాత మెల్లగా మామూలు జీవితం గడపడానికి ప్రయత్నిస్తుంటుంది. ఓరోజు ఆమె భర్త వస్తాడు. అయితే అప్పుడు హావ్ ఇంట్లో వుండదు. సైనికుడి భార్యకు పురుడు పోయడానికి వెళ్తుంది. వచ్చేసరికి అతను ఇంట్లో వుంటాడు. ఎందుకో అతనికి ఎదురుపడడానికి జంకుతుంది. అలా భర్త, మామల మాటలు వింటూ వుండిపోతుంది. వారు నిద్రపోయాక బయట వలలమీద పడుకుని నిద్రపోతుంది. లేచేసరికి భర్త ఆమె పక్కన కూర్చుని చూస్తుంటాడు...ఆ తర్వాత....

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

వియత్నాం గెరిల్లా

(4వ భాగం)

తన మృదువైన వేళ్లతో నా నుదుటి మీద పడుతున్న జుట్టును వెనక్కు నెడుతూ

"అక్కడ నిద్రపోతూ వుండడం చూశావా?" అని అడిగాడు.

"ఆ!"

గుండెల్లో పేరుకుపోయిన అవమానపు బరువును భరించలేకపోయాను. బావురుమని ఏడ్చాను. అప్పటివరకు అవమానంతో కుళ్లి కుళ్లి ఏడ్చాను. అప్పుడు భర్త దగ్గర వున్నాడు. ఏడుపు కట్టలు తెంచుకుంది.

ఒకసారి నావంక, మరొకసారి బయటికి చూస్తూ ఆయన మౌనంగా కూర్చున్నాడు. కొంతసేపు ఏడవనిచ్చి తన చెయ్యి నా భుజమ్మీద వేశాడు. గదిలో పాప ఏడుస్తోంది.

నన్ను కౌగిలించుకుని, నెత్తిమీదున్న ముసుగు తొలగించి చెంపలమీదుగా కారుతున్న కన్నీళ్లు తుడిచాడు. "పాప ఏడుస్తోంది, నువ్వు ఏడవకు" అన్నాడు.

భర్త ఓదార్చేటప్పుడు ఏడవకూడదని తెలుసు. కానీ ఆపుకోలేకపోయాను. పాపను తీసుకురావడానికి గదిలోకి వెళ్లాడు. పాప ఏడవడం మానింది. కానీ కొత్త ముఖం చూసి, నాదగ్గరకు రావడానికి గింజుకోసాగింది. ఏడుపుమాని, చేతులు చాచి,

"పాపను ఇవ్వండి" అన్నాను.

"ఏడవడం లేదులే"

పాప ఏడుపు మాని మెదలకుండా ఉండడంతో నేను కూడా ధైర్యంగా వున్నాను. పాపను ఎత్తుకునే, "నిన్ను బాధపెట్టడానికి రాలేదు. నిన్ను బాధపెట్టి నేను బాధపడడం నాకిష్టంలేదు. దుర్మార్గులు నిన్ను క్షోభపెట్టారు. అది పీడకలగా భావించి మరిచిపోవడానికి ప్రయత్నిద్దాం" అన్నాడు.

మాట్లాడడం ఆపి సముద్రం వంక చూస్తూ "గాలి ఎటు వీస్తే అటు కొట్టుకుపోయాను. చాలాదూరం తిరిగాను. మంచీ, చెడూ అనుభవించాను. ఎక్కువగా చెడ్డరోజులు గడిపాను. అప్పుడు కలిశావు. నాతో వస్తానన్నావు. అందుకు నేను ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? పారిపోవడం నీచమైనదని భావించబట్టి. స్వతంత్రం కోసం పోరాడడం ప్రధానం. అందుకోసం పోరాడుతున్న వారి పట్ల సానుభూతి లేకపోతే నిష్ప్రయోజనం. నా మాదిరిగా నా మార్గంలో నడుస్తున్న వారిలో నీవు ముఖ్యమైనదానివి. ఆత్మీయురాలివి. దురదృష్టవశాత్తు ప్రయాణంలో గాయపడ్డావు. నీ గాయం నిన్నెంతగా గాయపరిచిందో నన్నుకూడా అంతగా బాధపెట్టింది. ఆ గాయం త్వరగా మానకపోతే ఇద్దరికీ మరణమే శరణ్యం" అంటూ చెప్పసాగాడు.

అలా చాలాసేపు చెప్పాడు. మాట్లాడడం ఆపేటప్పటికి అతని కళ్లు నీళ్లతో నిండాయి. ఆయన చెప్పిన ప్రతి మాటా జాగ్రత్తగా విన్నాను. ప్రతి మాటా నన్ను కదిలించివేసింది. అతని వంక చూశాను. ఎంతో హాయినిచ్చింది. ఊపిరి పీల్చుకున్నాను. ముందుకు తల వంచి అతని పాదాలకు ఆనించాను. కన్నీరు అతని పాదాలపై పడింది.

♦♦♦

ఆరోజు పూర్తిగా తెల్లవారకముందే మామయ్య నిద్రలేచి బయటికి వెళ్లాడు. మధ్యాహ్నానికి తిరిగి వచ్చాడు. బుట్టెడు రొయ్యల్ని, పీతల్ని పట్టుకొచ్చాడు. నేను వంట చేస్తుంటే ఆయన పాపను ఆడించాడు. నేను శ్రద్ధగా వంట చేయడం చూసి భార్యాభర్తలు బాగానే వున్నారని మామయ్య చాలా సంతృప్తి చెందాడు. మనమరాలిపై మరింత ప్రేమ చూపించడం ద్వారా అది వ్యక్తం చేశాడు. బయటికి వెళ్లి "పాపా, ఎక్కడున్నావ్?" అని పిలిచాడు.

తాత మాట విని పాప నలుదిక్కులా వెతికింది. మామయ్య తన కొడుకు వెనకాల దాక్కున్నాడు. తాతయ్యను వెతికింది కానీ కనుక్కోలేకపోయింది. చివరకు తాతయ్య ముందుకు వచ్చి పాపను ముద్దాడాడు. అతని గడ్డం చక్కలి గింతలు పెట్టడంతో తన తలను తండ్రి ఛాతిలో దాచుకుని నవ్వసాగింది. ఆయన కూడా నవ్వి వంట చేస్తున్న నా దగ్గరకు వచ్చి పక్కనే కూర్చున్నాడు.

"రొయ్యల్ని తిని చాలా కాలమైంది"

"నీవున్న చోట రొయ్యలు దొరకవా?"

"లేదు, చాలా అరుదు"

కొంచెంసేపు ఆలోచించి "మన పాప పేరు నిర్ణయించావా?" అని అడిగాడు.

"ఇంకా లేదు"

"హాయ్" అని ఎవరు పెట్టారు?" అన్నాడు నవ్వుతూ.

"తాత్కాలికంగా పెట్టాం" అన్నాను తత్తరపడుతూ.

పాప గడ్డాన్ని ముద్దుపెట్టుకుంటున్నట్లు "ప్చ్" అని, "హాయ్, హాయ్" అని పిలిచాడు. నాకు నవ్వాగలేదు.

మామయ్యతో కలిసి సముద్రంలో వేటకు వెళ్లడానికి 'టాట్' భోజనం చేసి మా ఇంటికి

వచ్చాడు.

ఒక సంగతి చెప్పడం మరిచాను. శత్రువులు అంతా దోచుకుపోయిన తర్వాత నావ కొనడానికి అక్కడక్కడా తిరిగి సరిపడా డబ్బులు సంపాదించాడు మామయ్య.

***

ఒడ్డుకు దూరంగా నావ లంగరు వేసి వుంది. మామయ్య నెమ్మదిగా నడిచివెళ్లి నావను లాక్కొచ్చాడు. 'టాట్' వలల్ని నావలో పడేశాడు. ఆయన పాపను ఎత్తుకున్నాడు. ఇద్దరం కలిసి నావ దగ్గరకు వెళ్లాం. చిన్న పొగాకుకట్ట, రెండు సీసాలతో మంచినీళ్లు, దీపం నేను పట్టుకున్నాను. వాటిని నావ ముందు భాగంలో పెట్టాను. మామయ్య ఎప్పుడు వేటకు బయలుదేరినా వీటిని నేను సిద్ధం చేసే దానిని.

"పాపను యివ్వు" అని మామయ్య నావలో నుండి అడిగాడు.

"తాతయ్యతో కలిసి వేటకు వెళతావా?"

పాప సంతోషంతో మామయ్య వంక చేతులు ఊపసాగింది.

"రాత్రికి దీపం వెలిగించడం మర్చిపోకు. తిరిగి రావడానికి పొద్దుపోవచ్చు. అప్పటికి గాలి మారవచ్చు" అన్నాడు మామయ్య.

ఈ ప్రాంతం నుండి ఆయన వెళ్లి చాలా కాలం అయినా చిన్నప్పుడు సముద్రపు ఒడ్డున దీపం పెడుతూ వుండే వాడు. గ్రామంలోని వాళ్లు సముద్రంలోకి వేటకు వెళ్లినప్పుడు ఒడ్డున దీపం వుంచుతారు. గాలి మార్పిడి మూలంగా వాళ్ల దారి తప్పుతారన్న భయంతో అలా వుంచుతారు. ఎర్రని దీపాన్ని గడకు కట్టి బీచ్‌లో పాతేవాళ్లం. ఆ విషయం ఆయనకు గుర్తుందని ఆయన ముఖం చూస్తే అర్థమైంది.

పాప నా చంకలోనే వుంది. ఆయనకు దగ్గరగా వెళ్లి, "గెరిల్లా దళాలు ఏర్పడక పూర్వం ఇక్కడ ఎర్రదీపం కనపడగానే శత్రుమూకలు వచ్చి నావలు తిరిగి వచ్చే వరకు ఇక్కడే వుండి అవి రాగానే పరుగెత్తుకెళ్లి పట్టుకొచ్చిన చేపల్ని దోచుకుపోయేవారు" అని చెప్పాను.

"ఇప్పుడు కూడా తరచుగా వస్తున్నారా?" అని అడిగాడు.

"లేదు. వాళ్ల క్యాంపుల మీదే మన దళాలు దాడులు చేస్తున్నాయి. అందుకని భయంతో వారు బయటికి రావడం లేదు"

ఆయన ఇసుకమీద కూర్చుని పక్కనే నన్ను కూడా కూర్చోబెట్టుకున్నాడు. సూర్యాస్తమయమౌతోంది. అక్కడ ఇసుకతిన్నె చాలా తెల్లగా వుంటుంది. ఎంత తెల్లగా వుంటుందంటే కొంగలు ఇక్కడ వాలితే మనం కనుక్కోలేం.

"నెలలో ఎంతమందికి పురుడు పోస్తుంటావ్?"

"నిఖరంగా ఇన్ని అని చెప్పలేను. ఒక నెలలో ఎక్కువ వుంటాయి. మరో నెలలో అసలు వుండకపోవచ్చు. లేదా తక్కువ వుండొచ్చు. నేను తరచూ 'హేచ్'లో వెళ్తుంటాను. ఈ చుట్టుపక్కల నేనొక్కదాన్నే మంత్రసానిని" అని వివరించాను.

"అయితే రాత్రి ఆ సైనికుని భార్యకు ఎలా వుంది?"

"బాగానే వున్నారు. అయితే ఎవరూ దిక్కులేరు. చెల్లెలికేమో తెలియదు. భర్తేమో క్యాంపులో వుంటాడు. అతను దీమాగా ఇంటికి వచ్చాడు. అప్పటికే ఆలస్యమైంది. నా సహాయం కోసం ఆమెను ఇక్కడకు దగ్గరలో వున్న గ్రామానికి తీసుకొచ్చాడు. అతను ఇక్కడకు రావాలనుకున్నాడు. కానీ మన దళాలు వున్న విషయం తెలుసు. అందుకని రావడానికి భయపడ్డాడు. అతని పైఅధికారి తన తొత్తుల్ని పంపించి అతనిని బలవంతంగా తీసుకెళ్లాడు.

"నీ పనికి ఎంతిస్తున్నారు?"

నా ముఖాన్ని తన హృదయానికి హత్తుకుని "హావ్, బాగా పనిచెయ్యి. 'థై'ని బాగా పెంచు. నీ కృషి మన ప్రజలకు, ఉద్యమానికి ఉపయోగపడుతుంది. శత్రువులలో ప్రచారం చెయ్యమని నీ స్నేహితులు అడిగితే అంగీకరించు. నాన్నతో కూడా చెప్పాను. బతకడం అంత కష్టంకాదు. అయితే జాగ్రత్తగా వుండు. పాప చిన్నది. నేను దూరంగా వుంటాను. పాపను మంచిగా పెంచుతావని నా విశ్వాసం. పాపే మన ఆశాదీపం. నేను కూడా ఇంటికి వచ్చిపోతుంటాను. అయితే ఎప్పుడూ సాధ్యం కాదు. భారమంతా నీదే" అని చెప్పిన మాటలు మరువలేను.

'నెలకు అరవై కిలోగ్రాముల ధాన్యం"

నా వంక సానుభూతిగా చూస్తూ "నీకూ పాపకు అవి సరిపోవనుకుంటాను"

"తినటానికి సరిపడా బియ్యం ఇంట్లో వున్నాయి. రోజా అమ్మకానికి మామయ్య చేపలు బాగానే తెస్తున్నాడు. తీరిక సమయంలో నేను నేత నేస్తున్నాను.

తగలబడిపోయిన మగ్గం సంగతి కూడా చెప్పాను. అది బాగుచేయని విషయం కూడా చెప్పాను. నా చదువు సంధ్యల గురించి అడిగాడు. ఇక్కడ చెప్పేవారు లేరని చెప్పాను. గ్రామ సంఘం నుండి తెచ్చుకున్న పుస్తకాలో, స్నేహితులు ఇచ్చినవో చదువుతూ వుంటానని చెప్పాను.

"ఎలాంటి పుస్తకాలు చదువుతున్నావ్?"

"దొరికిన పుస్తకమల్లా చదువుతాను. ప్రత్యేకమంటూ ఏమీ లేదు" అన్నాను తడబడుతూ.

"మా దళం దగ్గర చాలా పుస్తకాలు వున్నాయి. నేను వెళ్లిన తర్వాత కొన్ని పంపుతాను" అన్నాడు.

సముద్రపు గాలి హోరున వీస్తోంది. పాపను గుండెలకు హత్తుకున్నాను. "ఇంక పాపను 'హేయ్' అని పిలవకు" అన్నాడు.

"ఏమని పిలవమంటారు?"

"'థై' అని పేరు పెట్టాలనుకున్నాను. బాగుంటుందా? ఆడపిల్ల పేరేనా?" అడిగాడు.

"ఎన్‌గాల్ థై" అని నేను తిరిగి అన్నాను.

ఆయన తలూపి "పేరు నచ్చిందా?" అని తిరిగి అడిగాడు. నేను బాగుందన్నాను. ఆ విధంగా మా మొదటి బిడ్డకు నామకరణం జరిగింది. చీకట్లు అలుముకుంటున్నాయి. గాలి హోరు ఎక్కువైంది. అంచున వున్న తడి ఇసుక ఆరిపోసాగింది. నా దగ్గర నుండి పాపను తీసుకుని ఎత్తుకుని గాలికి ఎదురుగా నిలబడ్డాడు. పక్షుల గుంపులు మాపైనుండి ఆకాశంలో ఎగిరిపోతున్నాయి. దూరంగా మామయ్య నావ చిన్నదిగా కనపడుతోంది. కాళ్ల కింద అలలు శబ్దం చేస్తూ వెనక్కుపోతున్నాయి.

ఆయన ఇంటి వద్ద మూడు రోజులు వున్నాడు. మూడోరోజు రాత్రి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. సిల్కు బట్టలు బాగా వుతికి సంచిలో పెట్టి బెల్టు పెట్టాను. నేను సంపాదించి దాచిన అయిదు నోట్లు ఆయనకు ఇచ్చాను. ఇంక చాలా రోజుల వరకు తిరిగి రాడని ఆ రోజంతా పాపతో ఆడుకోనిచ్చాను. అతని రాకవల్ల నాలో ఆదుర్దా తగ్గింది. పెద్ద బరువు దించినట్లు ఫీలయ్యాను. ఆశ, ఆనందం నాలో చిందులు వేశాయి. అయినా తన మనస్సులోని బాధను అధిగమించడానికి అతను ప్రయత్నిస్తున్నట్లు తోచింది.

గడిచిన రెండు రోజుల్లో ఒకసారి కూడా నాకు జరిగిన అన్యాయం గురించి ప్రస్తావించనే లేదు. మాటల సందర్భంలో కూడా ఆ ప్రసక్తే తేలేదు. ఆ విషయం నేను మరచిపోవాలని ఆయన అనుకుంటున్నట్లుగా తోచింది. గత రాత్రి నా పట్ల ఎంతో వాత్సల్యం చూపించాడు! శ్రద్ధ కూడా కనపరిచాడు. కన్నీళ్లు ఆపుకోవడం నాకు చాలా కష్టమైంది. నా మీద అంత విశ్వాసం ప్రేమ చూపిస్తున్నప్పుడు అంతకన్నా నాకు కావల్సిందేముంది? నా ముఖాన్ని తన హృదయానికి హత్తుకుని "హావ్, బాగా పనిచెయ్యి 'థై'ని బాగా పెంచు. నీ కృషి మన ప్రజలకు, ఉద్యమానికి ఉపయోగపడుతుంది. శత్రువులలో ప్రచారం చెయ్యమని నీ స్నేహితులు అడిగితే అంగీకరించు. నాన్నతో కూడా చెప్పాను. బతకడం అంత కష్టంకాదు. అయితే జాగ్రత్తగా వుండు. పాప చిన్నది. నేను దూరంగా వుంటాను. పాపను మంచిగా పెంచుతావని నా విశ్వాసం. పాపే మన ఆశాదీపం. నేను కూడా ఇంటికి వచ్చిపోతుంటాను. అయితే ఎప్పుడూ సాధ్యం కాదు. భారమంతా నీదే" అని చెప్పిన మాటలు మరువలేను.

(ఇంకా వుంది)

విజ్ఞాన వీధిక

ఆ బియ్యం ఉడికించక్కర్లా...



బిహు వంటి పండుగలలో వారు కోమల్ సవుల్ అనే రకం బియ్యాన్ని వాడతారు. ఆ బియ్యం ప్రత్యేకత ఏమిటంటే, దానిని ఉడికించనవసరంలేదు. కోమల్ సవుల్ రకాలు కొన్ని నిమిషాల పాటు నీటిలో నానబెడితే రుచిగా, తినేందుకు వీలుగా తయారవుతాయి. ఈ బియ్యాన్ని పాలతో గానీ, పెరుగుతో గానీ, బెల్లంతో గానీ కలిపి పండుగ సమయాల్లో సేవిస్తారు. మన పాలన్నం లాగా అన్నమాట.

కొత్త వంగడాలను తయారు చేయడం వ్యవసాయంలో సర్వసాధారణమే. అందుకు అనేక పద్ధతులను అవలంబిస్తారు. కొన్ని జన్యువులతో సంబంధం లేకుండా వుంటే, ఇంకొన్ని ప్రత్యేకంగా ఇటీవలి కాలంలో, జన్యుపరమైన మార్పులు చేసి సృష్టించినవి వున్నాయి. అయితే అటువంటి జన్యు మార్పు చెందిన పంటలు దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు సృష్టిస్తాయని ఇప్పుడిప్పుడే వెల్లడవుతోంది.

ప్రపంచవ్యాప్తంగా వరి బియ్యం ముఖ్యమైన ఆహారం. మన ప్రాంతంలో అయితే బియ్యాన్ని ఎన్ని రకాలుగా వండుతారో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. పైగా డజన్ల కొద్దీ వరి వంగడాలు రూపొందించి రకరకాల రుచులను మన ముందుంచారు శాస్త్రవేత్తలు. అలాగే ఒక్కో ప్రాంతంలో పండే వరి ఒక్కో రకమైన లక్షణం కలిగి వుంటుంది. ఆ ప్రకారమే కొన్ని ప్రాంతాల వరికి గిరాకీ ఎక్కువ. వరి బియ్యాన్ని వుడికించి తినడం ఆనవాయితీ. ఆ మాటకొస్తే అదే సరైన పద్ధతి కూడా. కాబట్టి అన్నాన్ని ఉడికించడానికి అనేక పరికరాలు కూడా రూపొందాయి.

అసలు బియ్యాన్ని ఉడికించే అవసరం లేకుండా తినగలిగితే? అటువంటి ప్రసక్తే లేదు. ఎందుకంటే అలా చేస్తే బియ్యం పచ్చిగా వుంటుంది. తినే వీలు వుండదు. కానీ అస్సాం ప్రజలు అలాగే తింటారు. కనీసం బిహు వంటి పండుగలలో వారు కోమల్ సవుల్ అనే రకం బియ్యాన్ని వాడతారు. ఆ బియ్యం ప్రత్యేకత ఏమిటంటే, దానిని ఉడికించనవసరంలేదు. కోమల్ సవుల్ రకాలు కొన్ని నిమిషాల పాటు నీటిలో నానబెడితే రుచిగా, తినేందుకు వీలుగా తయారవుతాయి. ఈ బియ్యాన్ని పాలతో గానీ, పెరుగుతో గానీ, బెల్లంతో గానీ కలిపి పండుగ సమయాల్లో సేవిస్తారు. మన పాలన్నం లాగా అన్నమాట.

ఈ మెత్తటి బియ్యంలో ఎమైలోజ్ అనే పిండి పదార్థం తక్కువ శాతం ఉంటుందని తెలిసింది. ఎమైలోజ్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ బియ్యం అంత గట్టిగా ఉంటుంది. మామూలు వరి రకాలలో ఎమైలోజ్ సుమారు ఇరవై, ఇరవైఐదు శాతం వుంటే కోమల్ సవుల్‌లో అది దాదాపు ఐదు శాతం కంటే తక్కువే వుంటుంది. ఈ ప్రత్యేక లక్షణాన్ని కలిగిన వరి వంగడాన్ని విస్తృతంగా పండించగలిగితే ఎన్నో లాభాలు వుంటాయి. ఉదాహరణకు వంట కోసం నిత్యం ఎన్నో టన్నుల ఇంధనం (ఎన్నో రూపాల్లో) ఖర్చవుతుంది. తద్వారా బోలెడు ధనం కూడా. అంతే కాక వంట చెరకు, ఇంధనం వల్ల వాతావరణ కాలుష్యం కూడా పెను సమస్యగా మారింది. ప్రస్తుతం పర్యావరణ రక్షణపై విస్తృతంగా ప్రపంచ వ్యాప్త చర్చలు, అవగాహన, ప్రాముఖ్యత పెరిగిన నేపథ్యంలో అన్నం వండే అవసరం లేకపోవడం ఒక రకంగా లాభసాటి వ్యవహారమే.

ఈ కారణంగా కోమల్ సవుల్ రకపు బియ్యాన్ని ఇతర ప్రాంతాల్లో పండించడానికి అనువుగా కటక్‌లోని కేంద్ర వరి పరిశోధన సంస్థ ఒక వంగడాన్ని రూపొందించింది. కోమల్ సవుల్ లాగా మృదువుగా వుండే ఈ కొత్త వంగడం పేరు అఘునిబోర. రూపొందించడమే కాదు, దీనిని ఒరిస్సాలో పండిస్తున్నారు కూడా. అక్కడి వేడి, తేమను తట్టుకుని, ఏమాత్రమూ కోమల్ సవుల్ లక్షణం కోల్పోకుండా అఘునిబోర పండుతోంది. ఇంత వరకు కోమల్ సవుల్ రకాలు ఈశాన్య ప్రాంతాల్లో మాత్రమే పండేవి. పైగా ఇవి తక్కువ దిగుబడిని ఇస్తాయి. అందుకే పరిశోధకులు సాంప్రదాయకంగా వున్న బోర రకాన్ని అధిక దిగుబడినిచ్చే మరొక రకంతో సంకరం చేసి అఘునిబోరను సృష్టించారు.

ఈ కొత్త రకాన్ని ఇతర ప్రదేశాలలో కూడా పండించే ప్రయత్నాలు చేస్తున్నారు. దానితో పాటు బియ్యంలోని లక్షణాలను కూడా అధ్యయనం చేస్తున్నారు. అంతా విజయవంతంగా జరిగితే, అఘోనిబోర ప్రజలకు నచ్చితే, అనూహ్యరీతిలో వంట ఇంధన వాడకం తగ్గిపోతుంది. ఆ కారణంగా బోలెడు ఆదాతో పాటు వాతావరణ కాలుష్యం కూడా పరిమితమవుతుందని అనుకుంటున్నారు.

అయితే దీనివల్ల ఎక్కువ లాభపడేవారు పేదలే. కాకపోతే సురక్షితమైన మంచినీరు కూడా దొరకని ప్రదేశాలు మెండుగా వున్న మన దేశంలో వుడకబెట్టకుండా కేవలం నీటిలో నానబెట్టి అన్నం ముప్పూటలా తినడం ఆరోగ్యానికి ఎంతవరకు హాని చేస్తుందో అన్న భయాందోళనలు అప్పుడే బయలుదేరాయి.

జపాన్‌లో బియ్యం కడిగిన నీటిని సౌందర్య సాధనంగా వాడతారు. ఈ నీటిలో ఇ విటమిన్‌తో పాటు ఆవశ్యక కొవ్వు ఆమ్లాలు కూడా వుండడంతో చర్మంమీద మలినం సంపూర్ణంగా పోయి మృదువుగా అవుతుంది. చైనాలో ఇలా బియ్యం కడిగిన నీటిని చేపల వాసన పోగొట్టడానికి వాడతారు.

తైవాన్‌లో శాస్త్రవేత్తలు నీటిలోపల వరి మొక్కలు పెరగడానికి కారణమైన జన్యువును కనుగొన్నారు. సి.ఐ.పి15గా పేరు పెట్టిన ఈ జన్యువు(ఒక ఎంజైమ్) వల్ల మొక్కలు నీటిలో మునిగివున్నా పెరిగే వీలు కలుగుతుంది. ఈ పరిశోధన వల్ల వరదలను తట్టుకునే వంగడాలను రూపొందించే అవకాశం కలుగుతుందని అంచనా.

- కాకర్లమూడి విజయ్

క్రైమ్ కథ

నన్ను వదిలేయ్

- యర్నాగుల సుధాకరరావు

"నాకూ అలానే ఉంది. సరే, నీతూ గురించి ఏం రాసి క్లోజ్ చేయమంటావు? అదీ నీవే చెప్పవయ్యా" అని పకపకమని నవ్వాడు.

"వెరీ సింపుల్! ఎవడితోనో ఎగిరిపోయింది అని రాసేసి చేతులెత్తేయండి" అని దేవరాజ్ విపరీతంగా నవ్వాడు. అప్పుడే "ముజే ఛోడ్‌దో యహాసే" అని ఒక ఆడగొంతు సెల్‌లో లీలగా వినిపించింది స్వరూప్‌కు.

కారులోంచి దిగి తొలిసారి పోలీస్ ఠాణాలో అడుగుపెట్టాడు ధనరాజ్. ఇన్‌స్పెక్టర్ స్వరూప్ అయోమయంగా చూసి లోపలకు ఆహ్వానించాడు. "ఇన్‌స్పెక్టర్! ఢిల్లీ నుంచి మా అమ్మాయితో ఇక్కడకి వచ్చిన నీతూ అనే అమ్మాయి కనిపించకుండా పోయింది. ఆమె ఫొటో ఇది. దయచేసి వెతికి పెట్టండి ఇన్‌స్పెక్టర్. ఆమెకు హిందీ, ఇంగ్లీషు వచ్చు" పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశాడు ధనరాజ్.

"మీరు గొప్పవారు, పనికట్టుకుని ఠాణాకే వచ్చారంటే మేటర్ చాలా సీరియస్‌గానే ఉందని అర్థమవుతోంది. మీ ఇంటికి నేనే స్వయంగా వచ్చి మీ అమ్మాయిని మరిన్ని వివరాలు అడుగుతాను" ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

"తప్పకుండా రండి. నేను ఇంటి దగ్గరే ఉంటాను" చెప్పి వెనుదిరిగాడు ధనరాజ్.

స్వరూప్ తన చేతిలోని అమ్మాయి ఫొటోని పదేపదే చూస్తూ ఆలోచించాడు. పిల్ల ఫొటోలోనే అందంగా ఉంది. మంచి రంగు. ఈ సిటీలో ఎక్కడ ఎలా మిస్ అయ్యుంటుందా? అని అనేక కోణాల్లో ఆలోచనలు చేశాడు." వెంటనే మోటార్‌బైక్‌మీద ధనరాజ్ ఇంటికి వెళ్లాడు. అతడి కూతురు చంద్రికను అడిగి చాలా విషయాలు ఆరా తీసి నోట్ చేశాడు. ఢిల్లీలో చంద్రిక, నీతూ కలిసి చదువుకుంటున్నారు. నీతూకు ఎలాంటి లవ్ ఎఫైర్ లేదు. పైగా తన ఎమ్మే క్రిమినాలజీ అయ్యాక విదేశాల్లో చదవాలనుకుంటోంది. ఆమెను ఎవరో కావాలని కిడ్నాప్ చేశారు. అదే ఎందుకు?

అప్పుడే ఇంట్లోకి వచ్చిన ధనరాజ్ కొడుకు దేవరాజ్ ఇన్‌స్పెక్టర్‌కు నమస్కరించి "సార్ మా ఇంటికి వచ్చిన నీతూను ఎలాగైనా వెతికిపట్టుకుని గండం గట్టెక్కించండి సార్. ఈరోజు వాళ్లమ్మ ఢిల్లీ నుంచి ఫోన్ చేసింది. నేను ఏదో చెప్పి మేనేజ్‌చేశాను"

"నీ సెల్‌నెంబర్ నీతూ మమ్మీవద్ద ఎలా ఉందిరా?" చంద్రిక అయోమయంగా అడిగింది.

"మనందరి నెంబర్లు నీతూ వాళ్ల మమ్మీకి ఇచ్చిందట. అందుకే వాళ్లమ్మ నీతూకు ఫోన్‌చేసి చివరికి మన నెంబర్లకు రింగ్‌చేస్తే అన్నీ ఎంగేజ్‌లో ఉన్నాయంట. అప్పుడు నాకు చేసి మా అమ్మాయికిచ్చి మాట్లాడించు అని కోరింది"

"మిస్టర్ నువ్వు, నీ చెల్లెలు మీ ఫోన్‌నెంబర్లు ఢిల్లీవారికి ఎలా తెలిశాయి అనేదానిపై నేను వెళ్లాక మాట్లాడుకోండి. ఇక నీతూను వెతకడంలో మా శాయశక్తులా ప్రయత్నించగలం. అన్నట్టు నీవు టచ్‌లో ఉండు నా సెల్‌నెంబర్ నోట్‌చేసుకో!" అని ఇన్‌స్పెక్టర్ చెప్పగా "మీ నెంబర్ నా దగ్గర ఉంది సార్" అని టపీమని చెప్పాడు దేవరాజ్.

"ఒకే ధనరాజ్‌గారూ! మీ అబ్బాయి చాలా ఫాస్టుగా ఉన్నాడు. నేను వెతక్కపోయినా మీ అబ్బాయి వెతికి తెచ్చేట్టున్నాడు" నవ్వేసి బయటికి వెళ్లిపోయాడు ఇన్‌స్పెక్టర్.

పోలీసులకు ఫిర్యాదు అంది పదిగంటలు అయినా నీతూ గురించి ఏ చిన్న క్లూ సంపాదించలేకపోయారు. మరోవైపు ధనరాజ్ పైఅధికారులకు నీతూను వెతికిపెట్టమని చెప్పేశాడు. వారు ఇన్‌స్పెక్టర్‌పై ఒత్తిడి చేశారు. అర్ధరాత్రివేళ స్వరూప్ దేవరాజ్‌కు ఫోన్ చేశాడు.

"దేవరాజ్ నీతూ వెతుకులాటలో శారీరకశ్రమ తప్పితే ఏమీ తెలిసిరాలేదు. నీకెవరి మీదైనా అనుమానం ఉందా? బాగా గుర్తుతెచ్చుకుని చెప్పు" అని కోరాడు.

"నో సార్ ఎవరి మీదా అనుమానం లేదు. ఇంత రాత్రివేళ మీరు ఇంకా వెదుకులాటలో ఉన్నారంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది సార్"

"ఈరోజు నాకిష్టమైన రమ్ము తాగలేకపోయానయ్యా. కేసులో ఇన్‌వాల్వ్ అయ్యానంటే నాకు ఏదీ అక్కర్లేదు. ఏదీ పట్టదు. కానీ, ఈరాత్రి నాకు నిద్రపట్టిచావదు. అందుకే రమ్ము బాటిల్‌ముందు కూర్చున్నాను. నాలుగు పెగ్గులేసుకుంటే చెవులు మొద్దుబారిపోతాయి. ఆపైన కళ్లు వాలిపోతాయి. ఒకే" అని చెప్పి సెల్ ఆపేశాడు. మరోగంట గడిచింది.

సెల్ రింగైంది. వెంటనే రిసీవర్ చెవికి అదిమి "నేను ఇన్‌స్పెక్టర్‌ని మాట్లాడుతున్నాను. ఎవరూ....ఓహ్ దేవరాజా కొంపదీసి నీకు ఎవరిమీదైనా అనుమానం ఉన్నవాడి గురించి చెబుతావా? నేను లేచి నిలబడలేను, అంతగా తాగాను. ఉదయమే చెప్పు. ఇంతకీ నువ్వు రాత్రి పడుకోవా ఇంత రాత్రివేళ ఫోన్ చేశావు"

"సార్ మీకు తెలియంది కాదు. నాకు మీలాగే రెండు పెగ్గులు వేసుకుంటే తప్ప నిద్రపట్టిచావదు. నీతూ చాలా అందమైన అమ్మాయి సార్. ఎవరైనా చూస్తే తలతిప్పుకోలేరు. ఏదో మిస్సింగ్ అని రాసేసి ఫైలు క్లోజ్ చేయండి సార్" అని ముద్దగా చెప్పాడు.

"తప్పకుండా ఆ పని చేసేస్తాను. లేకుంటే నేనెక్కడని వెతకను?"

"మీతో మాట్లాడుతుంటే చాలా ఆనందంగా వుంది సార్"

"నాకూ అలానే ఉంది. సరే, నీతూ గురించి ఏం రాసి క్లోజ్ చేయమంటావు? అదీ నీవే చెప్పవయ్యా" అని పకపకమని నవ్వాడు.

"వెరీ సింపుల్! ఎవడితోనో ఎగిరిపోయింది అని రాసేసి చేతులెత్తేయండి" అని దేవరాజ్ విపరీతంగా నవ్వాడు. అప్పుడే "ముజే ఛోడ్‌దో యహాసే" అని ఒక ఆడగొంతు సెల్‌లో లీలగా వినిపించింది స్వరూప్‌కు.

"దేవరాజ్ ఎక్కడున్నావయ్యా! నీవు ఇప్పుడు రమ్మన్నా రాలేను. నా కాళ్లు నామాట విని ముందుకు అడుగులు వేయవు. నా చెవులు కూడా వింటున్నాయో లేదో అన్నట్టుగా ఉన్నాయి. అంతగా తాగేశాను"

"మానాన్న నాకు ఒక గెస్టుహౌస్ కట్టిచ్చాడు"

"ఏదో ఒకరోజు అక్కడకు వచ్చి కలుస్తాను. అప్పుడు నాకు పోయాల్సిన రమ్ము నాకు పోసేయ్. గుడ్‌బై" అని సెల్ కట్ చేసేసి ఒక్క ఉదుటున లేచాడు స్వరూప్.

స్వరూప్ వ్యాన్‌లో పోలీసులను ఎక్కించుకుని బయల్దేరాడు.

ఆ సాయంత్రమే ధనరాజ్, దేవరాజ్‌ల గురించి ఆరా తీశాడు. వ్యాన్‌ను గెస్టుహౌస్‌కు పోనివ్వమన్నాడు. దూసుకు పోయిందక్కడకు. తలుపు తడితే దేవరాజే తీసి గతుక్కుమన్నాడు. పోలీసులు లోపలకు వెళ్లి ఒక గదిలో నిర్బంధించిన నీతూను తీసుకుని వచ్చారు. దేవరాజ్‌ను అరెస్టుచేసి వ్యాన్ ఎక్కించుకుని బయల్దేరాడు స్వరూప్.

దేవరాజ్‌పై అనుమానంతో వల పన్నాడు. తానో తాగుబోతులా నమ్మించాడు ఇన్‌స్పెక్టర్. సెల్‌లో నీతూ ముజే ఛోడ్‌దో అని అరవడం విని ఆమెను రక్షించగలిగాడు. వాస్తవానికి స్వరూప్ బాగా తాగివున్నాడు.

చూద్దామా

పంచభూత లింగ క్షేత్రాలు


ఏకాంబరేశ్వర దేవాలయం

పంచభూతాలైన నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశం మనిషికి ప్రాణాధారం. మనిషి శరీరం ఈ ఐదింటితో నిర్మితమైందని భావిస్తుంటారు. మన పూర్వీకులు నాలుగు ప్రకృతి శక్తులకు అనంత శూన్యాన్ని కలిపారు. అది ఐదోది, ఆకాశం. వీటిని శివునికి ఆపాదించారు. అవే నేటి పంచభూత లింగాలై ప్రముఖ పుణ్యక్షేత్రాలలో పూజలందుకుంటున్నాయి. గ్రీకులు కూడా నేల, నీరు, నిప్పు, గాలి రూపాలలో తమ దేవతలను కొలిచేవారు. మరి ఈ వారం ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

పృథ్వీ లింగం

కంచి తమిళనాడులో ఉంది. ఇక్కడ నేలకు ప్రతీకగా ఆ మహాదేవుడు పృథ్వీ లింగ రూపంలో ఏకాంబరేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. పృథ్వీ లింగం అంటే మట్టి లింగం. ఈ ప్రాంతంలో పార్వతి ఒకప్పుడు ఘోరతపస్సు చేసిందనీ, ఒక శివలింగాన్ని ఇసుకతో (సైకత లింగం) తయారుచేసి ఆమె దానిలో ఐక్యమైందనీ స్థలపురాణం. ఈ లింగం మట్టితో తయారైంది కాబట్టి దీనికి నీటితో అభిషేకం చేయరు. మల్లెపువ్వులతో మాత్రమే పూజిస్తారు. తమిళ కీర్తనలను బట్టి క్రీ.శ 6వ శతాబ్దానికి పూర్వం ఏకాంబరేశ్వరుడి ఆలయం ఉన్నట్టు తెలుస్తోంది. తరువాత కాలంలో విజయనగర రాజులూ, పల్లవులూ, చోళులూ, ప్రత్యేకంగా శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయంలో తమ పాలనకనుగుణంగా కొన్ని నిర్మాణాలు చేసినట్టు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ ఆలయం సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 172 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఆలయ రాజగోపురం దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైనది. దీన్ని శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించారు. ఈ ఆలయంలో 1,008 శివలింగాలు ఉంటాయి. అమ్మవారు కామాక్షీదేవి. ఇక్కడ ఒక మామిడి చెట్టు ఉంది. అది దాదాపు 3,500 ఏళ్ల నాటిదని చెప్తారు. ఈ చెట్టు నాలుగు శాఖలూ నాలుగు రకాల పండ్లనిస్తాయట. ఆ శాఖలు నాలుగు ధర్మాలకు ప్రతిరూపాలని భక్తుల నమ్మకం.

జల లింగం

పంచభూతాలయాలలో రెండోది జంబుకేశ్వరం. తిరువనైకావల్ అని పిలిచే ఈ ప్రాంతంలో పూర్వకాలంలో జంబు(నేరేడు) పండ్లు ఎక్కువగా ఉండడం వల్ల దీనికి జంబుకేశ్వరం అని పేరు వచ్చిందట. జంబుకేశ్వరం కింది నుంచి ఎప్పుడూ నీరు ఊరుతుంది. దీన్ని భక్తులకు తెలియజేయడానికి పూజారులు స్వామి ఉన్న పానవట్టం మీద ఒక వస్త్రం కప్పి ఉంచుతారు. కాసేపయ్యాక దాన్ని తీసి పిండితే నీరు వస్తుంది. కొంత కాలం ఇలా వచ్చేదట. అయితే ఇప్పుడు నిరంతర జలప్రవాహం లేదు. తమిళులు ఈ స్వామిని 'అప్‌లింగేశ్వరుడు, నీర్‌తిరళ్లనాథర్' అని పిలుస్తారు. 'అప్' అంటే నీరు అని అర్థం. ఈ ఆలయం వైష్ణవ క్షేత్రం శ్రీరంగానికి 8 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. జంబుకేశ్వరాలయాన్ని శ్రీరంగంలోని రంగనాథుడి ఆలయం కన్నా ముందే నిర్మించారు. ప్రస్తుతమున్న ఆలయాన్ని చోళులు 11వ శతాబ్దంలో నిర్మించారు.

తేజోలింగం

ఈ క్షేత్రాన్ని భూమికి హృదయ భాగంగా చెప్తారు. తమిళనాడులోని తిరువణ్ణామలై ఆలయంలో తేజోరూపంలో వెలిసిన అరుణాచలేశ్వరుడు అగ్నికి ప్రతీక. దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో 217 అడుగుల ఎత్తు, 11 అంతస్తుల భారీ రాజగోపురంతో ఉన్న ఈ ఆలయానికి పెద్దపెద్ద ద్వారాలు, కుండాలూ, 7 ప్రాకారాలు ఉంటాయి. ఎత్తైన ప్రదేశం నుంచి చూస్తే పెద్ద దుర్గంలా ఉండే ఈ


జంబుకేశ్వర దేవాలయం


శ్రీకాళహస్తీశ్వరుడు

శ్రీముఖలింగేశ్వరాలయం

అరుణాచల ఆలయం అద్భుతంగా ఉంటుంది. ఈ ఆలయాన్ని పల్లవులు నిర్మించారు. ఈ ఆలయ స్థలపురాణం ప్రకారం... సృష్టి, స్థితి కర్తలైన బ్రహ్మవిష్ణువులు ఎవరు గొప్ప అన్నవిషయమై తమలో తాము వాదించుకుంటుండగా దాన్ని నివారించేందుకు శివుడు ఇక్కడ తేజోరూపంలో వెలిశాడని, ఇదే మహాశివరాత్రికి మూలమని చెప్పుకుంటారు. తమిళుల కాలమానం ప్రకారం కార్తీకమాసంలో ఇక్కడ దీపోత్సవం జరుపుతారు. ఇక్కడ విశేషమేమిటంటే మిగతా పంచభూత లింగాల రూపాలను కూడా ఇక్కడి మూడో ప్రాంగణంలో చూడొచ్చు. అన్ని లింగాలనూ దర్శించలేని వారి కోసం ఈ ఏర్పాట్లు చేశారు. ఇక్కడ అమ్మవారు ఉణ్ణామలై. అరుణాచలం ఆలయ ప్రాంగణంలోని నైరుతి దిశలో ఉండే పాతాళ లింగాన్ని రమణ మహర్షి పూజించాడట. ఇక్కడ చిత్రగుప్తుడికీ, ధర్మదేవతకూ ఆలయాలున్నాయి.

వాయులింగం

మిగిలిన నాలుగు పంచభూత లింగాలు తమిళనాడులో ఉండగా వాయు లింగం ఒక్కటే మన రాష్ట్రంలో ఉండడం విశేషం. అదే శ్రీకాళహస్తి. దక్షిణకైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తిలో శివుడు వాయుతత్వాన లింగరూపంలో వెలిశాడని భక్తులు విశ్వసిస్తారు. ఇక్కడ స్వామి శ్రీకాళహస్తీశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. మిగతా శివలింగాలకులాగా ఇక్కడ లింగం గుండ్రంగా, నున్నగా ఉండదు. నలుపలకలుగా తెల్లగా ఉంటుంది. గాలికి దీపాలు రెపరెపలాడుతుంటే ఆ వెలుతురులో గర్భగుడిలోని స్వామి స్వయం భూలింగం చాలా బాగుంటుంది.

ఆకాశలింగం

తమిళనాడులోని చిదంబరంలో శివుణ్ని భోళాశంకరుడు అంటారు. ఇది పంచభూత లింగాల్లో చివరిది. ఇక్కడ శివుడిది ఆకాశరూపం. అంటే శూన్యం. అందుకే ఇక్కడ ఆలయంలోని గర్భగుడిలో లింగ రూపం ఉండదు. అక్కడ ఖాళీగా ఉంటుంది. ఒక తెర మాత్రం ఉంటుంది. రోజూ పూజ చేసిన తరువాత కాసేపు ఆ తెరను తీస్తారు. కానీ అక్కడ ఏమీ ఉండదు. అది చిదంబర రహస్యం. చెన్నై నుంచి దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ఆలయం విల్లుపురం నుంచి తంజావూరుకు వెళ్లే మార్గంలో ఉంది. ఇక్కడ నటరాజస్వామిని శివరూపంలో కొలుస్తారు.

బంగారు తాపడంతో ఉండే గర్భగుడిలో శివుడు 3 రూపాలలో ఉంటాడు. సంపూర్ణ మానవ రూపంలో ఉన్న నటరాజస్వామి, స్ఫటిక రూపంలో ఉండే చంద్రమౌళీశ్వర స్వామి, మూడోది నిరాకారం, అంటే అక్కడ ఏమీ ఉండదు. ఇక్కడ శివుడు తన దేవేరితో కలిసి ఆనందతాండవం చేస్తాడని చెప్పే ప్రదేశాన్ని ఒక తెరతో కప్పి ఉంచుతారు. అక్కడ 'యంత్ర' చిత్రముంటుంది. నటరాజ స్వామికి, స్ఫటిక లింగానికి రోజూ పూజలు చేసిన తరువాత ఆ తెరను తీసి భక్తులకు చూపిస్తారు.

చిదంబరం ఆలయానికి 9 ద్వారాలున్నాయి. నాలుగు దిక్కుల అతి పురాతన గాలి గోపురాలు ఉంటాయి. చిదంబరం గర్భగుడిని 'చిత్సభ' అంటారు. దానికి ఎదురుగా నటరాజ స్వామి ఉండే 'కనకసభ, కాళికాదేవితో నాట్యం చేస్తున్నట్టు చెప్పుకునే 'నాట్యసభ, రాజ్యసభగా చెప్పే వెయ్యి స్తంభాల మంటపం, పంచమూర్తులు ఉన్న దేవసభ.... ఇంకా అనేక ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. ఇవన్నీ కూడా 40 ఎకరాల స్థలంలో నిర్మించి ఉంటాయి. చిదంబర ఆలయ పూజారిని 'శివోహంభవ'గా భావిస్తారు. అంటే శివుడూ తానూ వేరు కాదని పూజారి భావిస్తాడు. అంటే అజ్ఞానపు పొరలు తొలిగాక భగవంతుడు, భక్తుడు వేర్వేరు కాదని దీనర్థం. పంచభూత లింగాలు కాకపోయినా ఆయా విశిష్టతలతో అంత ప్రాముఖ్యతను సంతరించుకున్న శివాలయాలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయి.

సోమారామం

పరమశివుడి పంచారామాల్లో సోమారామం ఒకటి. అదే పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని గునుపూడి సోమేశ్వరాలయం. ఇక్కడ 5 అడుగుల స్ఫటిక లింగం ఉంది. చంద్రగమనం ప్రకారం ఈ లింగం రంగులు మారతాయి. అమావాస్యనాడు నల్లగా ఉండే ఈ లింగం పౌర్ణమి రోజుకు ధవళవర్ణంలోకి మారతాడని అంటారు. అందుకే సాక్షాత్తూ చంద్రుడే అర్చించాడని చెప్తారు. రెండంతస్తులు ఉండే ఈ ఆలయం కింది భాగంలో సోమేశ్వరుని గుడి, పై భాగంలో అన్నపూర్ణమ్మ గుడి ఉంటుంది.

శ్రీముఖలింగం

శ్రీకాకుళానికి 40 కిలోమీటర్ల దూరంలో శ్రీముఖలింగేశ్వరాలయం ఉంది. ఇక్కడ శ్రీముఖలింగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి కొలువై ఉన్నారు. ముఖలింగేశ్వరస్వామి ఆలయాన్ని మధుకేశ్వరాలయం అని కూడా అంటారు. ఈ ఆలయంలోని లింగం ఒక చెట్టుమొదలు మీద ఉంటుంది. విప్ప చెట్టు మొదలుమీద ముఖం ఆకారం కనిపించేదనీ అదే ముఖలింగంగా పేరు పొందిందనీ ఈ ఆలయ స్థల పురాణం. విప్ప చెట్టును మధుకం అంటారు. అందుకే ఈ ఆలయానికి మధుకేశ్వరాలయం అనే పేరు వచ్చింది. ఇంకా ఈ ఆలయంలో వరాహ, వామన తదితర విష్ణు అవతారాలు, సూర్యవిగ్రహం ఉన్నాయి. ఇక్కడ ఉన్న సోమేశ్వరాలయంలో 7 నాలుకల అగ్నివిగ్రహం ఉంటుంది.

కపోతేశ్వరాలయం

తూర్పు గోదావరి జిల్లాలోని కపోతేశ్వరాలయంలో శివలింగం మీద కపోత ముద్రలు ఉంటాయి. ఇదే ఇక్కడి ప్రత్యేకత. రాజమండ్రికి 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజోలు మండలంలోని కడలి గ్రామంలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయానికి సంబంధించి ఒక కథ ఉంది. ఈ ప్రాంతంలో ఒక శివభక్తుడు వేటకొచ్చినప్పుడు ఎంత సేపటికీ ఏమీ దొరకపోయేసరికి అలసిపోయాడు. అది చూసిన ఒక మగ పావురం అక్కడికి దగ్గరలోని శ్మశానంలో కాలుతున్న కట్టెలు తెచ్చి అందులో పడి ఆత్మత్యాగం చేసి ఆ వేటగాడి ఆకలిని తీర్చిందట. అది చూసిన ఆడ పావురం కూడా ఆ విధంగానే చేసే సరికి అతనికి జ్ఞానోదయమై తాను కూడా ఆత్మత్యాగం చేశాడట. ఇది గమనించిన శివుడు ఆ ముగ్గురికీ మోక్షం ప్రసాదించి అక్కడే కపోతేశ్వరునిగా వెలిశాడట. అందుకే ఇక్కడి శివలింగం మీద రెండు పావురాలు ఉంటాయి. నందీశ్వరుడి వెనుక వేటగాడు కనిపిస్తాడు. ఆలయం ఎదురుగా ఉన్న కపోత గుండంలో ప్రతి మాఘమాసం ఆదివారం గంగాదేవి అంతర్వాహినిగా ప్రవహిస్తుందని చెప్తారు.

కొప్పులింగేశ్వరుడు

తూర్పుగోదావరి జిల్లాలోని పలివెలలో కొప్పులింగేశ్వరుడి ఆలయం ఉంది. ఇక్కడ శివుడి ప్రత్యేకత కొప్పు. మరో విశేషమేంటంటే ఒకే పీఠంమీద శివపార్వతులు కొలువై ఉంటారు. అందుకే ఉమాకొప్పులింగేశ్వర స్వామి అంటారు.



'చిత్సభ' ఆలయం

సోమేశ్వరాలయం

అరుణాచలేశ్వరుని ఆలయం

కొత్త 'మలుపే'



కొత్త మలుపు
(కథల సంపుటి)
బడబాగ్ని శంకరరాజు
పేజీలు:78, వెల : 40/-
ప్రతులకు :
ప్రజాశక్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

బడబాగ్ని శంకరరాజు ఉత్తమ ఉపాధ్యాయుడే కాదు.. సామాజిక దృష్టి, శాస్త్రీయ దృక్పథం కలిగినవాడు. ఈ ఉత్తమ లక్షణాలన్నీ ఆయన రాసిన ప్రతి కథలోనూ వెల్లివిరిశాయి. ఆయా ప్రాంతాల మాండలికాలను ఉపయోగించడమే కాకుండా సమాజంలో అన్యాయానికి గురయ్యే వారందరినీ ఒక్కొక్క కథలో ప్రస్తావించారు. ఆయన పుట్టింది నెల్లూరులో, ఉద్యోగం చేసేది విజయనగరంలో.. కానీ ఆయన కథలు సీమకు కళింగకు ముడిపెడుతూ 'అదుపులేని పొదుపు' కథ రాయడం ఆయన హృదయ విస్తృతికి అద్దం పడుతుంది. అయితే ఈ కథలో మరో ముఖ్య విషయాన్ని 'మతం మత్తు మందులాంటిదని' మార్క్సును తల్చుకున్న తీరు ప్రశంసనీయం. తాగుబోతువాడు, మతం మత్తులో ఉన్నోడూ ఒక్కటే అన్న పోలిక హేతుబద్ధంగా ఉంది.

పెత్తందారులకూ, దళితులకూ మధ్య అంతరాన్ని ఆయన 'మృత్యుజలం' కథలో ఎంతో హృద్యంగా వర్ణించారు. ఆస్తులు పంచుకున్న తర్వాత అన్నదమ్ములు కట్టుకున్న ఇళ్లలా పెత్తందార్ల, దళితుల పల్లెలు ఎడంఎడంగా ఉండడాన్ని వర్ణించడం సందర్భోచితంగా ఉంది. పెత్తందారి కొడుకు మోటుబావిలో పడిపోతే పండితుడు దేవుణ్ణి రక్షించమని వేడుకోవటం, దళితుడైన లోకేశు రక్షించేందుకు దూకబోతుంటే 'అంటరానివాడివి' అనటం మూఢత్వాన్ని తెలియజేసింది. మనుషుల మస్తిష్కాల్లోని కుళ్లు ఆలోచనలతో నిమిత్తం లేకుండా లోకేశు కుక్క బావిలో దూకడం కర్తవ్యాన్ని బోధించింది. పిల్లవాడి ప్రాణాల్ని కాపాడమని లోకేశును స్త్రీలు వేడుకున్న తీరు వారిలోని మాతృత్వాన్ని తెలియజెప్పింది. లోకేశు బావిలో దూకి పిల్లవాడ్ని రక్షిస్తాడు. ఇంతచేసినా.. దళితులకు తాగునీటిని ఇవ్వాల్సి వచ్చేప్పటికి పొలాల దగ్గర పగలు పెంచుకున్న పెత్తందారులు ఒక్కటై వాళ్లకు నీళ్లివ్వకుండా అడ్డుకోవడం వారిలోని అగ్రవర్ణ అహంకారాన్ని, దళితుల పట్ల వివక్షను, తమ అభివృద్ధి ముఖ్యమన్న పెత్తందార్ల స్వార్థం కథనంలో చెప్పిన తీరు రచయితను అభినందించే విధంగా ఉన్నాయి. ఈ కథలోని ఆనందనాయుడు, లోకేశ్‌లు పల్లెల్లో జీవించే వారికి, పల్లెలకు వెళ్లేవారికీ తారసపడే పాత్రలే. ఇలాంటి కథలు రాసిన శంకరరాజు తన వంతు సామాజిక బాధ్యతను నెరవేర్చిన వారయ్యారు.

'కొత్త మలుపు'లో నేటి సమాజంలో ఉద్యోగం చేసే ఆడవాళ్లు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను కథనంగా తీసుకోవడం రచయితకు ఆడవారి సమస్యల పట్ల ఉన్న సమగ్ర అహగాహనను తెలియజేసింది. ఈ కథనంలో స్త్రీని కామంతో చూసే మృగాలకే ప్రమాదం జరిగినప్పుడు ఆ స్త్రీ మాతృమూర్తిలా ఎలా స్పందిస్తుందో వివరించిన తీరు హృదయాన్ని ద్రవింపజేసింది. నేటి సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాల పట్ల మృగాల్లా మారకుండా మగవాళ్ల కళ్లు తెరిపించిన కథ 'కొత్త మలుపు' నిజంగా కొత్త మలుపే.

'ఆఖరి తడి' కథలో రాయలసీమలో కరువు పరిస్థితుల్లో రైతు సేద్యం ఎంత అధ్వాన్నంగా ఉంటుందో శంకరరాజు కళ్ల ముందుంచారు. గుడ్డిలో మెల్లలా వచ్చిన కాసింత చెరువునీరు కూడా చిట్టచివర్న ఉండే సాగుమడి చేసే రైతులకు అందడంలో జరిగే అన్యాయాన్ని చెప్పిన తీరు వాస్తవాన్ని అద్దినట్లుంది. ఆఖరితడిలో అన్యాయమే కాకుండా పెత్తందార్లచేతిలో మరింత అన్యాయమవుతున్న దళిత రైతుల దుస్థితి 'ఈ దబాయింపులు ఈనాటివా! రాజులు, జెమిందార్ల కాలం నుంచి ఇదే వరస...' అంటూ నాటి నుంచి కొనసాగుతుందని రచయిత చెప్పిన తీరు కులవివక్ష చరిత్రను చెప్పినట్లయ్యింది. పెద్దలు చేసే వెధవపనుల్ని ప్రశ్నించినా, న్యాయం కోసం ఎదురుతిరిగినా పెత్తందార్లు ప్రాణాలు తీయడానికీ వెనుకాడరని రచయిత కథనం నడిపిన తీరు కంటతడి పెట్టించింది.

- శాంతిశ్రీ



చూపు
(కవితా సంపుటి)
చలపాక ప్రకాష్
వెల : 40/-, పేజీలు :96.
ప్రతులకు : చలపాక ప్రకాష్
పోస్ట్‌బాక్స్ నెం.5,పి.ఎ.మార్కెట్
షాప్.నెం: 61, జెండా వీధి,
విజయవాడ - 520001.
మరియు
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని
బ్రాంచీలు.

స్ఫూర్తి
(కవితా సంకలనం)
జి. యాదగిరి రావు
వెల : 30/-, పేజీలు :58.
ప్రతులకు : సాహితీ స్రవంతి
1-1-187/1/2.
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్.
మరియు
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని
బ్రాంచీలు.



కీటక చాక్లెట్లు



తేలు చాక్లెట్లు, పురుగు లాలిపాప్‌లు మీరెప్పుడైనా చూశారా? కనీసం విన్నారా? వీటిని చైనీయులు లొట్టలేసుకుంటూ లాగిస్తారట. ఫోటోలు చూడండి మీకే తెలుస్తుంది. తేళ్లలో విషముంటుంది కదా వారికేమవదా అని మీకు అనుమానం రావచ్చు. అయితే వాటితో చాక్లెట్లు తయారుచేసేముందు వాటిని ఉడికిస్తారట. దానివల్ల అందులోని విషం పోతుంది. వాటిని తినడంవల్ల ఎటువంటి అపాయమూ ఉండదట. పైగా ఎర్రలకు ఓట్ ధాన్యంతో చేసిన భోజనం, ఆపిల్, అరటితొక్కలు పెడతారు. కాబట్టి వాటిలో మంచి ప్రోటీన్లు వుంటాయంటున్నారు తయారీదారులు. మరి మొదటిసారిగా కీటక చాక్లెట్‌ను ఎప్పుడు తయారుచేశారో తెల్సా! 1982లో. ఎంచక్కా ఓ కీటకాన్ని లాలిపాప్‌లో చుట్టేసి తయారుచేశారు. మరి దీనికి డిమాండ్ ఎలా వుందంటారా! అక్కడికే వస్తున్నాం. ఆ సమయంలో దానిని అందరూ ఇష్టంగా తిన్నారు. అయితే ఎంతకాలం డిమాండు ఉంటుందో మాత్రం తెలియలేదు. ఈ చాక్లెట్లను ఆపిల్, నిమ్మ, నారింజ వంటి ఫ్లేవర్లతో తయారుచేయడం మొదలుపెట్టారు లారీ పీటర్‌మేన్. ఆయన వీటి కోసం ప్రత్యేకంగా పురుగులను పెంచుతాడు. ప్రస్తుతానికి తేలు చాక్లెట్ కొత్త రకం. తేళ్లు విషపూరితమైనవని చాలామంది అనుకుంటారు కానీ అవి చనిపోయిన తరువాత ఆ విషం ఎక్కువ కాలం ఉండదు. ఎంచక్కా లాగించేయొచ్చంటాడాయన.



సీతాకోక చిలుకలు

-కె. సాహిల్

అదొక అడవి. అడవిలో పెద్ద సింధూర వృక్షం. దాని మీద రెండు గొంగళిపురుగులు. అన్నాచెల్లెలన్నమాట. అవి రెండూ ఎప్పడూ కలిసే వుంటాయి. కలిసే ఆడుకుంటాయి. తింటాయి. కబుర్లాడుకుంటాయి. అప్పడప్పడూ పోట్లాడుకుంటాయికూడా. కానీ ఆ రెంటికీ ఒకదానిమీద మరొకదానికి చెప్పలేనంత ప్రేమ.

ఓరోజు అవి ఆ వృక్షం పైభాగానికి చేరుకున్నాయి. ఆపూటకి అక్కడే కూర్చుని భోజనం చేయాలనుకున్నాయి. ఆకాశంవైపు చూస్తూ... ఎగిరే పక్షుల్ని, వీచే గాలుల్ని, కదిలే కొమ్మల్ని చూస్తూ... తింటుంటే ఎంత బావుంటుందో కదా. అందుకనే ఆ రోజు అలా భోజన ఏర్పాట్లు చేసుకున్నాయి. మాంచి ఆకుపచ్చ రంగులో నిగనిగలాడుతున్న ఆకుని ఎంచుకున్నాయి. దాని మీద కూర్చుని ఎంచక్కా కొరుక్కుని తినసాగాయి. తినేటప్పడు కబుర్లు సహజమే కదా. కబుర్లలో వుండగానే... పెద్ద గాలి వీచింది. ఆధాటికి గొంగళిపురుగులు రెండూ తటాలున నేలమీద వచ్చి పడ్డాయి. అవి రెండూ చుట్టూరా చూశాయి. కనుచూపు మేర అంతా మట్టే. అయితే కొద్ది దూరంలో చెట్టు మొదలు కనిపించింది. ఎలాగైనా తమ ఇంటికి చేరుకోవాలనుకున్నాయి. మెల్లగా ప్రయాణం మొదలెట్టాయి. అలా చాలాసేపు నడిచాక వాటికెందుకో ఓ అనుమానం వచ్చింది. తాము అప్పటి వరకు ప్రయాణించిన ప్రదేశానికి ప్రస్తుతం నడుస్తున్న చోటుకు తేడా వుందనిపించింది. ఇది మట్టి రంగులో మెత్తగా వుంది. అవి రెండూ ఆశ్చర్యపోయాయి. అకస్మాత్తుగా నేల మెత్తగా అయ్యిందేంటి చెప్మా అనుకున్నాయి. బహుశా చెట్టు ఎక్కేశామేమో అనికూడా అనుకున్నాయి. అలా ముందుకు వెళ్తూనే వున్నాయి. అయితే కాసేపటికి తాము నడుస్తున్న చెట్టు కదులుతున్నట్టనిపించింది. రెండూ భయపడిపోయాయి. ఇంతలో ఒక గొంగళిపురుగు అసలు విషయాన్ని కనిపెట్టింది.

"ఓయ్! ఇది చెట్టు కాదు. ఏనుగు కాలు" అని పెద్దగా అరిచింది.

ఈలోగా ఏనుగుకు తన కాలిమీద ఏదో పాకినట్టనిపించి...కిందకు చూసింది. దానికి రెండు గొంగళిపురుగులు కనిపించాయి.

"హేయ్! చిన్నారి గొంగళిపురుగులూ ... మీరిద్దరూ నా కాలినెందుకు గీకుతున్నారు?" అనడిగింది.

మెల్లగానే అడిగినా ఏనుగు కదా. స్వరం పెద్దగా వుండేసరికి అవి రెండూ బెదిరిపోయాయి. మెల్లగా ధైర్యం తెచ్చుకొని చెట్టుమీద కూర్చుని భోజనం చేస్తున్న దగ్గర నుంచి గాలి వీచడం...కిందపడడం... చెట్టు వెతుక్కుంటూ బయలుదేరడం వరకూ పొల్లుపోకుండా మొత్తం చెప్పేశాయి.

ఏనుగు వాటి కథ విని జాలిపడింది. అంతేనా! వాటికి బోలెడంత ధైర్యం కూడా చెప్పింది. రెంటినీ తీసుకెళ్లి చెట్టు మొదలు దగ్గర వదిలింది. దానికి అవి ఎంతో సంతోషంగా...

"ధన్యవాదాలు మిత్రమా! మాకు చాలా శ్రమ తప్పించావు. నీ మేలు ఎన్నటికీ మరవలేము" అని చెప్తాయి.

♦♦♦

అప్పటి నుంచి అదే చెట్టు మీద రెండు గొంగళి పురుగులు ఒకదాని గురించి మరొకటి జాగ్రత్తలు తీసుకుంటూ సంతోషంగా గడుపుతుంటాయి. అయితే కొన్నాళ్లకు అవి తమ కోసం ప్యూపా ఏర్పాటు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమౌతుంది. అంటే ఆ తర్వాత అందమైన సీతాకోకచిలుకలుగా తయారౌతాయన్నమాట. రెండూ ఒకదానికొకటి బై చెప్పకుని ప్యూపాలోకి వెళ్లిపోతాయి.

అయితే అందులోంచి బయటికొచ్చాక ఒకదానినొకటి తప్పనిసరిగా కలవాలనుకుంటాయి. సీతాకోక చిలుకలయ్యాక ఎవరు అందంగా వున్నారో చెప్పకోవాలనుకుంటాయి. కానీ గొంగళిపురుగు దశ నుంచి అందమైన సీతాకోకచిలుకగా మారడానికి మధ్య దశలో ఒంటరిగా గడపడమే చాలా కష్టం. అయినా అందంగా అవ్వాలంటే కష్టపడకతప్పదు కదా.

♦♦♦

అవి రెండూ ప్యూపాలో వున్నప్పడు కూడా పెద్ద గాలి దుమారం వస్తుంది. దాంతో అవి రెండూ కింద పడతాయి. అయితే మొదట్లోలా పక్కపక్కన కాదు. ఒకటొక చోట. మరొకటి మరోచోట. ఒకటి నది పక్కన పడుతుంది. రెండవది పొలాల పక్కన పడుతుంది.

రోజులు గడుస్తాయి. గొంగళిపురుగులు రెండూ రంగురంగుల సీతాకోకచిలుకలుగా మారతాయి. ఇంత పెద్ద ప్రపంచంలో ఒంటరిగా అనిపిస్తుంది రెంటికీ. అలా మారిన మరుక్షణం నుంచి అటు ఇటు తెగ పరిశీలిస్తాయి. కొత్తగా వచ్చిన రూపంతో హాయిగా విహరిస్తున్నా... ఏదో వెలితి. తన నేస్తాన్ని, తోబుట్టువును కలుసుకోలేకపోయానే అన్న దిగులు మదిలో మెదులుతూనే వుంటుంది. అందుకే తమ పాత ఇంటిని, తోబుట్టువును కనిపెట్టడానికి రెండూ బయలుదేరాయి.

(అసలు రెండూ ఒకదాన్ని మరొకటి పోల్చుకున్నాయా? లేదా? అవి రెండూ కలుసుకున్నాయా? లేదా? తర్వాత ఏమైంది? తెలియాలంటే మరి పై వారం వరకు వేచిచూడాల్సిందే.)